Rni Title Code No. TELTEL02115

గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 340 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 డిసెంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

కొనసాగుతున్న దట్టమైన పొగమంచు.. దారుణంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో దట్టమైన పొగమంచు కొనసాగుతోంది. ఢిల్లీని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఢిల్లీతోపాటు పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు చుట్టుముట్టింది. రహదారులపై దృశ్యమానత దాదాపుగా సున్నాకి పడిపోయింది. అలాగే ఉష్ణోగ్రతలు కూడా భారీగా పడిపోయాయి. నగరంలో ఉష్ణోగ్రత 6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. దీంతో ఢిల్లీలో తీవ్ర స్థాయిలో చలిగాలులు వీస్తున్నాయి. దట్టమైన పొగమంచు, తక్కువ దృశ్యమానత కారణంగా కొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో ఉత్తర భారతదేశం మొత్తం చలిగాలులు వీస్తున్నాయి. ఢిల్లీలో దట్టమైన పొగమంచు ఏర్పడడాన్ని స్థానిక వాతావరణ విభాగం ధృవీకరించింది.

పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కేటీఆర్

హైదరాబాద్ : మాజీ సీఎల్పీ నేత, దివంగత పీ జనార్ధన్ రెడ్డి(పీజేఆర్) 16వ వర్ధంతి సందర్భంగా ఖైరతాబాద్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీజేఆర్ సేవలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అమిత్ షా పోస్ట్‌మార్టం



ఇంకోసారి రిపీట్ కావొద్దు..

బీజేపీ ముఖ్య నేతలకు అమిత్‌షా క్లాస్

హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై పోస్ట్‌మార్టం చేపట్టారు. గురువారం హైదరాబాద్ చేరుకున్న ఆయన శంషాబాద్ నోవాటెల్‌లో ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించారు. కొత్త ప్రభుత్వం పాలన, రాజకీయ పరిణామాలపై నేతలతో చర్చించారు. ఈ భేటీలో కిషన్‌రెడ్డి, తరుణ్‌చుగ్, డీకే అరుణ, బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల రాజేందర్, మురళీధర్‌రావు, గరికపాటి, చాడా సురేష్‌రెడ్డితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో గతం కంటే స్థానాలు, ఓట్ షేర్ పెరిగినప్పటికీ మరింత మెరుగ్గా రావాల్సిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరింత మంచి ఫలితాలు సాధించాలని నేతలకు సూచించారు. బీజేపీ ముఖ్యనేతల మధ్య కోల్డ్‌వార్‌పై అమిత్ షా సీరియస్ అయ్యారని తెలుస్తోంది. వ్యక్తిగత లక్ష్యాల కోసం కాకుండా పార్టీ కోసం పనిచేయాలని హితవు పలికారని సమాచారం. సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలకు దూరంగా ఉండాలని కోరినట్లు తెలుస్తోంది. నేతల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలని కిషన్‌రెడ్డిని ఆదేశించారు.

బీజేపీ శాసనసభ పక్షనేత ఎంపికపై చర్చ.. బీజేపీ శాసనసభ పక్షనేత ఎంపికపై అమిత్ షా సమావేశంలో చర్చ జరిగింది. బీసీ సీఎం హామీ ఇచ్చిన నేపథ్యంలో ఫ్లోర్ లీడర్‌గా బీసీ ఎమ్మెల్యే ఉంటే బావుంటుందని అమిత్ షా అభిప్రాయపడ్డట్టు తెలుస్తోంది. కాగా ఈ రేసులో బీసీ ఎమ్మెల్యేలు రాజాసింగ్, పాయల్ శంకర్ ఉన్నారని సమాచారం. ఒకవేళ రెడ్డి సామాజికవర్గానికి అవకాశం ఇవ్వాలనుకుంటే రేసులో ఏలేటి మహేశ్వరరెడ్డి, కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ఉండే అవకాశం ఉంది.

సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ అవకాశం ! : నోవాటెల్ హోటల్లో బీజేపీ సీనియర్ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్‌తో అమిత్ షా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నేతల మధ్య కోల్డ్ వార్‌పై ఫోకస్ చేసిన నేపథ్యంలో ఈ మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పరస్పర విమర్శలు ఆపి పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మరోవైపు సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ చేసే అవకాశమిస్తామని అమిత్ షా స్పష్టం చేశారు. దీంతో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో కిషన్ రెడ్డి సికింద్రాబాద్ నుంచి మళ్ళీ బరిలో నిలవనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ బరిలో బండి సంజయ్, నిజామాబాద్ లోక్‌సభ నుంచి ధర్మపురి అర్వింద్ పోటీ చేయనున్నారు. సిట్టింగ్ ఎంపీలు పని చేసుకుంటూ పోవాలని చెప్పినట్లు సమాచారం.

500రూపాయలకు గ్యాస్ సిలిండర్లు వారికే..

మిడిల్ క్లాస్ వారికి షాకిచ్చిన రేవంత్ సర్కార్!!

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్లు ఇస్తుందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ గ్యారెంటీ అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మధ్యతరగతి ప్రజలకు షాక్ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు గ్యాస్ బాదుడు నుండి ఉపశమనం కలిగిస్తుందని భావిస్తే, అందుకు భిన్నంగా 500 రూపాయలకే వంట గ్యాస్ అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన మెలిక ఆందోళన కలిగిస్తుంది. దారిద్రరేఖకు దిగువన ఉన్న, తెల్లరేషన్ కార్డు ఉన్న నిరుపేద కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ వర్తించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మధ్య తరగతి ప్రజలను హతాశులను చేసింది. గత ప్రభుత్వ హయాంలో చాలామంది రేషన్ కార్డులు లేక ఇబ్బంది పడ్డారు. రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నా గత ప్రభుత్వం తూతూ మంత్రంగా రేషన్ కార్డుల మంజూరు చేయడంతో రేషన్ కార్డులు లేని సామాన్య కుటుంబాల సంఖ్య బాగా పెరిగింది. ఇప్పుడు వీరందరికీ రేషన్ కార్డుల టెన్షన్ పట్టుకుంది.

తమకు రేషన్ కార్డులు లేకుంటే మహాలక్ష్మి పథకంలోని గ్యారంటీలు రావని సామాన్య, మధ్య తరగతి ప్రజలు తెగ టెన్షన్ పడుతున్నారు. ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన ప్రజా పాలనలో గ్యారంటీ పథకాల కింద దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో సబ్సిడీ వంటగ్యాస్ పై ఆశలు చిగురిస్తున్నప్పటికీ, రేషన్ కార్డు లింక్ చెయ్యటంతో ఏం చెయ్యాలో అర్థం కాని పరిస్థితికి చేరుకున్నారు సామాన్య, మధ్యతరగతి ప్రజలు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారికే కాదు, మధ్యతరగతి ప్రజలకు కూడా గ్యాస్ బండ బాదుడు నుండి ఉపశమనం కలిగించాలని, సబ్సిడీ వంట గ్యాస్ అందించాలని మధ్యతరగతి కుటుంబాల మహిళలు అభ్యర్థిస్తున్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని తమకు కూడా గ్యాస్ 500రూపాయలకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

29న మేడిగడ్డకు తెలంగాణ మంత్రులు

కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష

హైదరాబాద్: రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు కలిసి డిసెంబరు 29న మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి మంత్రులు మేడిగడ్డకు బయలుదేరుతారు. బ్యారేజీ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుల వివరాలు.. ప్రాజెక్టు వ్యయం, దాన్ని కట్టడం ద్వారా జరిగిన లాభ, నష్టాలపై వివరణ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన విద్యుత్తు, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల సమస్యలు, వాటి పరిష్కారాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, సబ్ కాంట్రాక్టర్లు, నిర్మాణంతో సంబంధం ఉన్న అందరూ సమావేశంలో పాల్గొనే విధంగా సమాచారం అందించాలని ఈఎన్సీని మంత్రులు ఆదేశించారు.

అన్ని పథకాలకు తెల్లకార్డే ప్రామాణికం..

మరి రేషన్‌కార్డు లేనోళ్ల దరఖాస్తులెట్ల?

ఆరు గ్యారెంటీలకు అర్హతపై కొరవడిన స్పష్టత

'ప్రజాపాలన' అప్లికేషన్లపై ప్రజల్లో ప్రశ్నలెన్నో..

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తం (ఆరు గ్యారంటీ) పథకాల అర్హతకు తెల్లరేషన్ (ఆహార భద్రత) కార్డు ప్రామాణికం కానుంది. దారిద్ర్య రేఖకు దిగవనున్న (బీపీఎల్) కుటుంబం గుర్తింపు కార్డుగా రేషన్ కార్డు పని చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల కోసం అమలు తలపెట్టనున్న ఆరు గ్యారంటీ ప?థకాలైన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాల్లో మహా నగారానికి రైతు భరోసా మినహా మిగతా ఐదు పథకాలు వర్తించనున్నాయి. నేటి నుంచి ప్రజా పాలనలో భాగంగా వార్డుల వారీగా ఐదు పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరింస్తున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను సీఎం రేవంత్ రెడ్డి నిన్న ఆవిష్కరించారు. సమగ్ర కుటుంబ సర్వే తరహాలోనే స్వీకరించే దరఖాస్తుల్లో కుటుంబ పూర్తి వివరాలను తీసుకోనున్నారు. కుటుంబానికి సంబంధించి ఇళ్లు, ఆదాయం, గ్యాస్ కనెక్షన్, వాహనాలు, రేషన్ కార్డు, ఉద్యోగం ఇతరత్రా అన్ని వివరాలను దరఖాస్తులో స్వీకరిస్తారు. ఈ దరఖాస్తుల ఆధారంగానే గ్యారంటీ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. దరఖాస్తుల వెంట తప్పనిసరిగా రేషన్ కార్డు, ఆధార్ కార్డులను జత చేయాల్సి ఉంటుంది. రెండింటిలో ఏది లేకున్నా ఆదిలోనే దరఖాస్తులను తిరస్కరించనున్నారు. దీంతో పదేళ్ల పాటు కేవలం బియ్యం కార్డుగా పని చేసిన రేషన్ కార్డు బహుళ ప్రయోజనకారిగా మారి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

వడపోసి.. ఏరివేసి.. గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా , మేడ్చల్ జిల్లా పరిధిలో ప్రస్తుతం మొత్తం రేషన్ కార్డులు 17,21,994 ఉన్నాయి. ఇందులో గత పదేళ్లలో కొత్తగా మంజూరైన కార్డులు 1.21 లక్షలు మాత్రమే. వాస్తవానికి తెలంగాణ రాష్ట ఆవిర్భావం అనంతరం తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్పు చేయడంతోపాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బడిముబ్బడిగా కొత్త కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొంత కాలానికి అనర్హుల పేరిట కొన్ని కార్డులను ఏరి వేసి 15,99,639కి పరిమితం చేసింది. దీంతో తిరిగి కొత్త కార్డుల కోసం పెద్ద ఎత్తున సుమారు 3.40 లక్షల కుటుంబాలు దరఖాస్తులు చేసుకోగా మూడేళ్ల క్రితం 360 డిగ్రీల స్థాయిలో వడపోసి కేవలం 1.21 లక్షల దరఖాస్తులను మాత్రమే ఆమోదించి కొత్త కార్డులు మంజూరు మంజూరు చేసింది.

వైఎస్ హయంలోనే 16.98 లక్షల కార్డులు : తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పెద్ద ఎత్తున నిరుపేదలందరికి తెల్లరేషన్ కార్డుల భాగ్యం కలిగింది. అప్పట్లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం మీద తెల్ల రేషన్ కార్డుల సంఖ్య 16,98,982లకు చేరింది. అప్పట్లో చౌకధరల దుకాణాల ద్వారా అమ్మహస్తం పథకం కింద రూ.185కే తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు రూ.1 కిలో బియ్యంతోపాటు కందిపప్పు, చింతపండు, గోధుమలు, గోధుమ పిండి, కారంపొడి, నూనె తదితర సరుకులు పంపిణీ జరిగేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెల్లరేషన్ కార్డు ఆహార భద్రత కార్డుగా మారి కేవలం బియ్యానికే పరిమితమైంది.

ఎదురుచూపుల్లో 10 లక్షల కుటుంబాలు.. మహానగరంలో మరో 10 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. సుమారు కోటిన్నర జనాభా కలిగిన నగరంలో సుమారు 40 లక్షల కుటుంబాలు ఉండగా అందులో దారిద్ర్యరేఖకు దిగువ నున్న కుటుంబాలు 27.21 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. ప్రస్తుతం 17.21 లక్షల కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికంగా ప్రకటించడంతో తెల్ల రేషన్ కార్డుకు మరింత డిమాండ్ పెరిగింది. కొత్త తెల్ల రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గ్యారంటీ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నడంతో రేషన్ కార్డులు లేని కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

గ్యారంటీ పథకాలివే : కాంగ్రెస్ గ్యారంటీ పథకాల కోసం వార్డుల వారీగా ఈ నెల 28 నుంచి ధరఖాస్తులు స్వీకరించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 సాయం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్ వర్తించనుంది. గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వర్తించనుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలం, నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, ఉద్యమకారుల కుటుంబాలకు 250 చ.గ. స్థలం అందిస్తారు. యువ వికాసం పథకం కింద విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు. ప్రతీ మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు. చేయూత పథకం కింద వృద్ధులు, వితంతువులకు నిరుపేదలకు సామాజిక పెన్షన్ నెలకు రూ.4,000 చొప్పున అందిస్తారు. వారికి రూ. 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా వర్తించనుంది.

సంపాదకీయం

ఇవేం మాటలు? కశ్మీర్ ను గాజాతో పోల్చటమా పెద్ద మనిషి?

సంచలన వ్యాఖ్యలు చేసే జమ్ముకశ్మీర్ నేత ఫరూక్ అబ్దుల్లా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వెనుకా ముందు చూసుకోకుండా.. పరిస్థితుల్ని అర్థం చేసుకోకుండా మాట్లాడే అలవాటున్న ఆయన మరోసారి కశ్మీర్ పై భారత సర్కారు తీరును తీవ్రంగా తప్పు పడుతున్నట్లుగా వ్యాఖ్యలు చేశారు. భారత్ – పాక్ మధ్య చర్చల ద్వారా కశ్మీర్ వివాదానికి ముగింపు పలకకుంటే కశ్మీర్ కు గాజాకు పట్టిన గతే పడుతుందని పేర్కొంటూ షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. పూంచ్ జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో ఇటీవల ఐదుగురు ఆర్మీ జవాన్లు మరణించటం.. అనంతరం ఆర్మీ జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మరణించిన వేళలో ఫరూక్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అంతేకాదు.. మోడీ సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై చేసిన విమర్శల్ని పలువురు తప్పు పడుతున్నారు. పాకిస్థాన్ కు త్వరలో నవాజ్ షరీఫ్ ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నాయని.. భారత్ తో చర్చలు జరిపేందుకు నవాజ్ సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నా.. చర్చలకు మనమే సిద్ధంగా లేమన్నారు. ఒకవేళ చర్చల్లో సరైన ఫలితం రాకుంటే కశ్మీర్ కు గాజాకు పట్టిన గతే పడుతుంని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే జమ్ముకశ్మీర్ లోని రాజౌరీ.. పూంచ్ జిల్లాలను సందర్శించిన సందర్భంగా ఉగ్రవాదులు రహస్య స్థావరాలుగా చేసుకున్న గుహల్ని కూల్చేయాలన్న ఆదేశాల్ని ఇవ్వటం తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఈ పరిణామాలపై మాట్లాడిన ఫరూక్.. చర్చల ద్వారానే పాక్ తో పంచాయితీ తీర్చుకోవాలని సూచన చేయటం గమనార్హం. భారత్ ఎన్నిసార్లు చర్చలకు మొగ్గు చూపినా.. తన బుద్ధి మార్చుకోని పాక్ తీరు గురించి ఫరూక్ కు తెలీదా? అన్నది ప్రశ్న. అయినప్పటికి పాక్ కు వంతపాడినట్లుగా ఉన్న ఈ కశ్మీరీ నేత తీరును పలువురు తప్పు పడుతున్నారు. ఈ సందర్భంగా ఫరూక్ చేసిన వ్యాఖ్యను చూస్తే.. అప్పట్లో వాజ్ పేయ్ చెప్పిన మాటల్ని తప్పుడు అర్థంతో వ్యాఖ్యానించినట్లుగా చెప్పాలి. ''మనం స్నేహితుల్ని మనం మార్చగలం. కానీ మన పొరుగువారిని మార్చలేం. మనం మన పొరుగువారితో స్నేహపూర్వకంగా ఉంటే.. ఇద్దరు డెవలప్ చెందుతారు. ప్రస్తుతం యుద్ధం సరైన విధానం కాదు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి” అన్నట్లుగా గుర్తు చేశారు.అయితే.. ఫరూక్ మిస్ అవుతున్న పాయింట్ ఏమంటే.. పొరుగువారితో మనం ఎంత స్నేహంగా ఉన్నప్పటికీ.. మన ఇంట్లోని లాకర్ మీదా.. సంపద మీద ఫోకస్ పెట్టి.. కుట్రలు పన్నే వారితో ఏం చర్చలు జరపగలం? అన్న ప్రశ్న ఫరూక్ మదిలోకి ఎందుకు రాదన్నదిఅసలు ప్రశ్న.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు...

ఘట్కేసర్లోని ప్రభుత్వ భూములను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పరిధిలోని ఘట్కేసర్ మండలం కాచవని సింగారం గ్రామంలోని సర్వే నెంబర్ 66ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పరిధిలో ప్రభుత్వ భూమి ఎంత ఉంది అందులో కబ్జాకు గురైందా... అనే వివరాలను క్షుణ్ణంగా తెలుసుకొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి మాట్లాడు తూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా ప్రభుత్వ భూములను ఆక్రమించిన ట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అలాగే ఇప్పటి వరకు ఎవరైనా ప్రభుత్వ భూములు కబ్జా చేయడం, వాటిల్లో గుడిసెలు, తదితరాలు ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని అలా చేయనట్లయితే ప్రభుత్వపర మైన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ భూము ల్లో సర్వే నెంబర్లు, ప్రభుత్వ భూమి అని తెలిసేలా వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలని... దీంతో పాటు ఫెన్సింగ్ సైతం చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అధికారులు ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

శామీర్ పేట (గరుడ వార్త) : ఆనందోత్సవాల మధ్య ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు జరుపుకున్నారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని తుర్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. అలాగే మండల కేంద్రం శామీర్ పేటలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అలాగే తూముకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో దేవరయంజాల్ లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలను జరుపుకున్నారు. మూడు చింతలపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు యాదవ ఆధ్వర్యంలో ఆ పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట నాయకులు కిషోర్ యాదవ్, అశోక్, సాయిబాబు, ఓం ప్రకాష్, ఆంజనేయులు, ప్రభాకర్, ముజీబ్, తూముకుంట మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు శంకర్ గౌడ్, మురళి గౌడ్, ఎంసిపల్లి మండల వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, రాజేంద్రప్రసాద్, జెర్రీ పోతుల నరసింహులు, యాదగిరి, జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనతో ప్రజలకు మేలు జరిగేలా అధికారులు కృషి చేయాలి..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి

ప్రజా పాలన
అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకర
28.12.2023 - 06.01.2024

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సేవలు, సౌకర్యాలు అందించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ప్రజాపాలన వల్ల మేలు జరుగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని మొదటిరోజైన గురువారం ఘట్కేసర్ మండలం కాచవని సింగారంలో, జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం కీసర మండలంలోని బోగారంలో, శామీర్పేట మండలంలోని తుర్కపల్లి. యాడారం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి గ్రామసభ ను సందర్శించారు అక్కడి వివరాలను స్థానిక అధికారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనకు సంబంధించిన లబ్ధిదారులకు ఫారాలు సరిగ్గా అందాయా వాటిని ఎలా భర్తీ చేశారు తదితర వివరాలను ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. దీంతో పాటు పలువురు పూరించిన దరఖాస్తు ఫారాలను అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరు రకాల సేవలందిస్తోందని దీనికి సంబంధించిన ఫారాలను ఆయా గ్రామాల్లో ముందుగానే అందచేసి వాటికి సంబంధించి లబ్ధిదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డులను జత చేసి ఫారాన్ని నింపి సంబంధిత అధికారులకు అందచేయాల్సిందిగా తెలిపారు. ప్రతి అర్హులైన లబ్ధిదారులు ప్రజాపాలనలో ఫారాలను నింపి అధికారులకు అందచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల తహాశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గ్యారెంటీ పథకాల ప్రారంభించిన అధికారులు

శామీర్ పేట (గరుడ వార్త) : ప్రభుత్వ ఆదేశాల మేరకు తూముకుంట మున్సిపాలిటీ, షామీర్పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలో వివిధ గ్రామాలలో ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. కొన్ని గ్రామాలలో ఆరోగ్యారెంటీ లపై అవగాహన నిర్వహించగా మరికొన్ని గ్రామాలలో ఆరు గ్యారెంటీ లపై దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను సమర్పించడానికి ప్రజలు ఆయా గ్రామాల్లో అత్యధికంగా పాల్గొన్నారు. తుర్కపల్లి లో తాసిల్దార్ సత్యనారాయణ ప్రారంభించగా తూముకుంట మున్సిపల్ పరిధిలో చైర్మన్ రాజేశ్వరరావు, వైస్ చైర్ పర్సన్ వాణి వీరారెడ్డి, కమిషనర్ జైత్రం నాయకులు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

అలియాబాద్ గ్రామానికి చేరుకున్న అయోధ్య రామయ్య అక్షింతలు

శామీర్ పేట: (గరుడ వార్త) : అయోధ్య రామయ్య అక్షింతలు గురువారం సాయంత్రం అలియాబాదుకు చేరుకున్నాయి. మండలంలోని అలియాబాద్ గ్రామ ప్రధాని కూడలికి అక్షింతలు చేరుకోగానే గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి అక్షింతలను స్వీకరించారు. గ్రామస్తులు అంబేద్కర్ విగ్రహం నుంచి అక్షింతలు ఊరేగింపుగా ఎంతో ఉత్సాహంగా ఆనందోత్సవాల మధ్య శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి తీసుకువెళ్లారు. అక్షింతలు ఆలయంలో భద్రపరిచారు. అనంతరం గ్రామంలో పంచనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ఈ అక్షింతలను చేరవేస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గొలుసుకట్టు.. మద్యం మత్తు

పెద్దపల్లి: జిల్లాలో కల్తీ మద్యం దందా జోరుగా సాగుతోంది. మద్యం దుకాణాల్లో నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. టెండర్లలో దుకాణాలు దక్కించుకున్న మద్యం వ్యాపారులు అక్రమదందాకు తెరతీస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి గ్రామాల్లో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. 24 గంటల్లో దుకాణా విక్రేతల నిద్ర సమయం మినహా వేళాపాళా లేకుండా కిరాణా దుకాణాల్లోనే అనధికారికంగా గొలుసు(బెల్ట్) దుకాణాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వైన్స్ దుకాణా యజమానులు అక్రమ నిల్వలు, అస్తవ్యస్తంగా ఆదాయ వ్యయాల నిర్వహణ, పర్మిట్ రూమ్‌లలో అధిక ధరలు, పండగ, ప్రత్యేక రోజుల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరల్లో విక్రయాలు చేస్తున్నారు. ప్రముఖ మద్యం బ్రాండ్లకు సంబంధించిన బాటిళ్లను తెరిచి అందులో నీరు పోసి తిరిగి యథావిధిగా ప్యాకింగ్ చేస్తూ కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు చిత్తు

ఆబ్కారీ, పోలీసు శాఖల అధికారులకు ప్రతి మద్యం దుకాణం నుంచి నెలనెలా మామూళ్లు వెళుతుండటంతోనే దర్జాగా కల్తీ మద్యం దందా, బెల్ట్ దుకాణాల నిర్వహణ చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మద్యం దుకాణాదారులు ప్రత్యేక సెలవు దినాల్లోనూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా.. ఈ యంత్రాంగం తనిఖీలు చేయడం లేదు.మద్యం గ్రామాల్లో ఎప్పుడుపడితే అప్పుడు లభిస్తుండటంతో చాలా మంది సంపాదించిన డబ్బును మద్యం కొనుగోళ్లకు ఖర్చు చేస్తున్నారు. డబ్బు లేకపోతే ఇంట్లో ఉండే వస్తువులు విక్రయించి తాగుడుకు బానిసవుతున్నారు.

మద్యం దుకాణాల టెండర్లు 2021 సంవత్సరం నవంబర్‌లో నిర్వహించారు. ఇదే ఏడాది డిసెంబర్ 1 నుంచి 77 దుకాణాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. గొలుసు దుకాణాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వ పరంగా వీటికి అనుమతులు కూడా అవసరం లేకుండా పోవడంతో విచ్చలవిడిగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం నిల్వలతో కలిపి కల్తీ చేస్తూ మద్యం విక్రయిస్తున్నారు. రాత్రయ్యిందంటే మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. వీరి ఆగడాలతో పరస్పరం గొడవలు నిత్యకృత్యమవుతున్నాయి. నిర్వాహకులు ఏకంగా పెద్దపల్లిలోని మద్యం దుకాణాల నుంచి కల్తీ మద్యాన్ని తీసుకెళ్లి మారుమూల ప్రాంతాల్లో ఉండే తమ గొలుసు దుకాణాల్లో విక్రయిస్తున్నప్పటికీ ఏమీ తెలియనట్లుగా ఆబ్కారీ పోలీసులు తనిఖీలు చేయకుండా ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో తమ గొలుసు దుకాణాల సంఖ్యను పెంచేందుకు వ్యాపారులు అన్నీ వనరులు సిద్ధం చేసుకుంటు న్నారు.

ఈసారైనా గ్రామాల అభివృద్ధి జరిగేనా..?

గోదావరిఖని : అంతర్గాం, రామగిరి, పాలకుర్తి మండలాల్లోని నాలుగు గ్రామపంచాయతీలకు పాలకవర్గం లేకుండానే ఐదేళ్లు పూర్తయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీల పాలకవర్గం గడువు ముగియనుండటంతో జనవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా అయిదేళ్ల తర్వాత ఆయా గ్రామపంచాయతీలకు నూతన పాలకవర్గం రానుంది. ఇంతకాలం పాలకవర్గం లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో ఆయా గ్రామపంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గ్రామపంచాయతీల్లో ఖాళీగాఉన్న వార్డుమెంబర్లు, సర్పంచ్‌ల స్థానాలను భర్తీ చేసేందుకు ఉప ఎన్నికలు నిర్వహించినప్పటికీ సాంకేతికపరమైన కారణాలతో వాటితో పాటు అంతర్గాం, రామగిరి, పాలకుర్తి మండలాల్లోని నాలుగు గ్రామాలకు ఎన్నికలు నిర్వహించలేకపోయారు. ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతుండటంతో ఆయా గ్రామాల అభివృద్ధిపై స్థానికుల్లో ఆశలు వ్యక్తమవుతున్నాయి.

విలీనం నిర్ణయంతోనే తిప్పలు

అంతర్గాం మండలంలోని కుందనపల్లి, లింగాపూర్, రామగిరి మండలంలోని వెంకట్రావుపల్లి, పాలకుర్తి మండలంలోని ఎల్కలపల్లిగేటు కాలనీలను రామగుండం నగరపాలికలో విలీనం చేస్తూ 2018లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత 2019లో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా నగరపాలికలో విలీనమైన నేపథ్యంలో కుందనపల్లి, లింగాపూర్, వెంకట్రావుపల్లి, ఎల్కలపల్లిగేటు కాలనీలకు ఎన్నికలు నిర్వహించలేదు. నగరపాలికలో విలీనాన్ని నిరసిస్తూ ఆయా గ్రామాల ప్రజలు తీవ్రస్థాయిలో ఆందోళనలు వ్యక్తం చేయడంతో నగరపాలిక పరిధి నుంచి ఆయా గ్రామాలను వేరు చేసి యథావిధిగా గ్రామపంచాయతీలుగా ప్రకటించారు. 2020లో నగరపాలికకు ఎన్నికలు నిర్వహించగా అప్పటికే కార్పొరేషన్ నుంచి ఆయా గ్రామాలను తొలగించడంతో నగరపాలిక ఎన్నికల పరిధిలోకి రాలేదు. దీంతో ఆయా గ్రామాలు పాలకవర్గం లేక ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగుతూ వచ్చాయి. మరికొద్ది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలతో పాటు ఈ గ్రామాలకు సైతం ఎన్నికలు నిర్వహించనుండటంతో ఆయా గ్రామాభివృద్ధిలో ప్రధాన సమస్య పరిష్కారం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎల్కలపల్లిగేటు కాలనీ పరిస్థితులు ప్రత్యేకం

ఎల్కలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గుంటూరుపల్లి గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించిన ప్రభుత్వం ఎల్కలపల్లిగేటు కాలనీలోని ఎల్కలపల్లికి చెందిన రెండు వార్డులను రామగుండం నగరపాలికలో విలీనం చేశారు. విలీన గ్రామాల ప్రజల ఆందోళనలో భాగంగా ఎల్కలపల్లిగేటు కాలనీలోని రెండు వార్డులను నగరపాలిక నుంచి తొలగించి ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించారు. చాలా రోజుల పాటు ఎల్కలపల్లిగేటు కాలనీ గ్రామపంచాయతీకి డీడీఓ కోడ్ కేటాయించకపోవడంతో ఈ గ్రామానికి సంబందించిన నిధులు ఎల్కలపల్లి గ్రామపంచాయతీ ఖాతాలోనే జమచేస్తున్నారు. ఎల్కలపల్లిగేటు కాలనీ గ్రామపంచాయతీలో నిర్వహణపరమైన పనులు చేపట్టాక వాటికి సంబంధించిన బిల్లులను ఎల్కలపల్లి గ్రామపంచాయతీలో సమర్పిస్తే నిధులను విడుదల చేస్తుంటారు. ఈసారైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తతే ఆయుధం

పెద్దపల్లి : కరోనా వైరస్‌లోని కొత్త రకం వేరియంట్ కలవర పెడుతోంది. మూడేళ్ల కిందట పుట్టుకొచ్చిన వైరస్ క్రమంగా తగ్గుతున్న తరుణంలో మరోసారి తెరపై రావడం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాట్లు పూర్తి స్థాయికి చేరాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వనరులు సమకూర్చుతున్నారు. కానీ రద్దీ ప్రాంతాల్లో ప్రజలు కొవిడ్ నిబంధనలు పాటించడంలేదు. అప్రమత్తంగా ఉంటేనే వైరస్‌ను దూరం చేయవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అందుబాటులో పడకలు

జిల్లాలో గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలో 330, పెద్దపల్లి, మంథనిలో 50 చొప్పున, సుల్తానాబాద్‌లో 30 పడకలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు ఎన్టీపీసీ, సింగరేణి ఆసుపత్రుల్లో చికిత్స కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 199 అల్లోపతి, 28 ఆయుష్ వైద్యులు, 344 ఏఎన్ఎంలు, 359 పారామెడికల్, 808 అంగన్‌వాడీ, ఆశ, ఇతర సిబ్బంది ఉన్నారు. కరోనా చికిత్స అందించే ఔషధాలు, వెంటిలేటర్స్, ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చుతున్నారు.

స్వీయ రక్షణ అవసరం

కొత్త రకం వేరియంట్–జేఎన్ 1పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణలు చెబుతున్నారు. దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచిస్తున్నారు. వైద్య సేవలతో పాటు స్వీయ రక్షణ తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉంది. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో ఆర్టీసీల్లో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు తప్పకుండా మాస్క్ ధరించాలి.

కరీంనగర్ జిల్లాలో రెండు కొవిడ్ కేసులు

కరీంనగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం కొవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 రెండు కేసులు నమోదయ్యాయి. ఒకరు ఆసుపత్రి నర్సు కాగా మరొకరు శస్త్రచికిత్స కోసం వచ్చిన రోగికి పాజిటివ్ వచ్చింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సుకు కొవిడ్ లక్షణాలు కనిపించడంతో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయగా.. పాజిటివ్ అని తేలింది. పెద్దపల్లి జిల్లాకు చెందిక మహిళ కాలుకు పుండుకావడం తో జనరల్ సర్జరీ కోసం ప్రభుత్వం ఆసుపత్రిలో చేరింది. శస్త్రచికిత్సకు ముందు కొవిడ్ లక్షణాలు కనిపించ డంతో వైద్యులు ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేశారు. ఆమెకు పాజిటివ్ రావడంతో ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిం టెండెంట్ వీరారెడ్డి తెలిపారు. వీరిద్దరి రక్తనమూనాలను గాంధీ ఆసు పత్రికి పంపించనున్నట్లు వెల్లడించారు. కొవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1తోపాటు మరింకేమైనా సబ్ వేరియంట్‌లు ఉండనున్నాయా? అని రక్త నమూనాలను గాంధీకి పంపించినట్లు తెలిసింది. అంతా సిద్ధంగా ఉన్నాం– డాక్టర్ రమాకాంత్, జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణాధికారి పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్‌లో కరోనా చికిత్స కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం. అత్యవసర వైద్య చికిత్సకు వెంటిలేటర్లు, ఆక్సిజన్ సౌకర్యంతో పడకలు ఉన్నాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేదు. సిద్ధంగా ఉన్నాం.

జలాశయం సిద్ధం ప్రారంభమే ఆలస్యం



సిరిసిల్ల : జిల్లాలో 86 వేల ఎకరాలకు సాగు నీరందించే కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీలో మొదటి విడత పనులు దాదాపు పూర్తయ్యాయి. రాజరాజేశ్వర నుంచి మల్కపేట జలాశయంలోని నీటిని ఎత్తిపోసి ఈ ఏడాది మే, జూన్‌ల్లో ట్రయల్‌రన్ కూడా పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రారంభానికి సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో వాయిదా పడింది. ఈ ప్యాకేజీ సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాల పరిధిలో మూడు మండలాలకు సాగు నీరందించేలా ప్రణాళికలు చేశారు. వాస్తవానికి రెండేళ్ల క్రితమే పనులు పూర్తి కావాల్సి ఉంది. అధిక వర్షాలు, సొరంగం పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఈ ప్యాకేజీ పరిధిలో యాసంగి వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో వరి నాట్లు వరకు ఇబ్బంది లేదు. పంట చేతికందే సమయంలో భూగర్భ జలాలు అడుగంటితే సాగునీటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఈలోపు తొలి విడత పనులు పూర్తయిన మల్కపేట పంపుహౌస్‌ను ప్రారంభిస్తే ఆయకట్టుకు సాగు నీరందించవచ్చు.

రాజరాజేశ్వర జలాశయం నుంచి ఏడాదికి 120 రోజులు 11.63 టీఎంసీల నీటిని ఎగువమానేరుకు తరలించడం ఈ ప్యాకేజీ లక్ష్యం. తొలి దశలో మూడు టీఎంసీల సామర్థ్యంతో మల్కపేట జలాశయం నింపుతారు. దీని కుడి కాల్వ ద్వారా మల్కపేట, ధర్మారం, కనగర్తి, సుద్దాల, పల్లిమక్త, నాగారం, రామన్నపేట, మారుపాక గ్రామాలకు సాగు నీరందించేలా ప్రణాళికలు చేశారు. అయితే భూసేకరణ పరిహారం చెల్లింపులతో పనులు ముందుకు సాగలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా పనులు పూర్తయిన దాని ఆధారంగా ఆయా గ్రామాల పరిధిలోని గొలుసుకట్టు చెరువులను నింపాలని ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం జలాశయంలో నీటిని నింపితే ఆయా గ్రామాలకు సాగు నీటికి ఢోకా ఉండదు.

మల్కపేట జలాశయం ఎగువన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ నుంచి అప్రోచ్ కాల్వ ద్వారా మైసమ్మ చెరువు, సింగసముద్రం వరకు కాల్వ నిర్మాణం మూడేళ్ల క్రితమే పూర్తయింది. వీటికి ఇరువైపులా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం జరగాల్సి ఉంది. ప్రస్తుతం భూసేకరణ ప్రకారం నేరుగా చెరువుల్లోకి నీటిని విడుదల చేస్తూ పంటల సాగుకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఇది వరకే ప్రణాళికలు చేశారు. భూసేకరణ, పరిహారం చెల్లింపుల ఆధారంగా మిగతా పెండింగ్ పనులు పూర్తి చేయనున్నారు. సింగసముద్రం నుంచి బట్టలచెరువు, అక్కడి నుంచి ఎగువమానేరు పనులు ప్రగతిలో ఉన్నాయి. తొమ్మిదో ప్యాకేజీలో మల్కపేట జలాశయం ప్రారంభిస్తే ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లోని గ్రామాలకు యాసంగి సాగు నీటికి ఇబ్బందులు తప్పుతాయి. మల్కపేట జలాశయం ఎడమ కాల్వకు రూ.166 కోట్లతో అదనపు ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. దీంతో కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో పది వేల ఎకరాలకు సాగు నీరందించడం లక్ష్యం. 2019లో ప్రారంభమైన పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. పంపుహౌస్‌లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు 212 ఎకరాలు అవసరం కాగా ఇప్పటి వరకు 30 ఎకరాలు మాత్రమే సేకరించారు. నిమ్మపల్లి, అల్మాస్‌పూర్‌ల్లో మాత్రం పంపుహౌస్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఏళ్లు గడుస్తున్నాయి

–వేల్పుల అంజయ్య, రైతు, మల్కపేట

మల్కపేట జలాశయం కుడి కాల్వ నిర్మాణానికి నా వ్యవసాయ భూమిలోంచి వెళ్తుంది. రెండెకరాలు సేకరించారు. వానాకాలమే జలాశయం పనులు పూర్తయ్యాయని ఇంజినీర్లు చెప్పారు. అయినా ఇప్పటికీ నీళ్లు నింపలేదు. మిగతా ఎనిమిది ఎకరాలకు బోరుబావి తవ్వించి వరి సాగు చేస్తున్నాను. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయి. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా, ఇప్పుడు అప్పుడు అంటూ ఇంకా నీటిని విడుదల చేయడం లేదు. ఈ పంటకైనా నీటిని నింపి విడుదల చేయాలి.

పనులు పూర్తి చేయాలి–దార మల్లయ్య, రైతు, నిమ్మపల్లి

మా గ్రామం పూర్తిగా మెట్ట ప్రాంతం. ఎత్తిపోతల పథకం పూర్తయితే మా గ్రామంతోపాటు చుట్టు పక్కల నాలుగు గ్రామాలకు సాగు నీరు అందుతుంది. యాసంగికి అయిదు ఎకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం బోరు బావిలో సమృద్ధిగా నీరు ఉంది. వరినాట్లు పూర్తయితే బోరుబావిలో నీరు వేగంగా తగ్గుతుంది. ఏటా పంట చేతికొచ్చే సమయానికి నీరు అడుగంటి సగం పంట ఎండిపోతుంది. ఎత్తిపోతల పనులు పూర్తి చేసి సాగునీటిని అందించాలి.

వైద్య సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు

సిరిసిల్ల : జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పీహెచ్‌సీల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు రోగులకు ఉత్తమ సేవలు అందిస్తున్నారు. ఫలితంగా జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుంది. ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ట్స్ (ఎన్‌క్వాస్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే ఏడు పీహెచ్‌సీలు ఎన్‌క్వాస్‌కు ఎంపికై మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయి. మరో మూడు ఆరోగ్య కేంద్రాలను కూడా అందుకు అనుగుణంగా తీర్చిదిద్దారు. వీటికి కూడా త్వరలో జాతీయ స్థాయి గుర్తింపు లభించే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

నిబంధనలకు అనుగుణంగా..ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎన్‌క్వాస్ గుర్తింపునకు ఎంపికయ్యే విధంగా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుమన్‌మోహన్‌రావులు ఎప్పటికప్పుడు ఆరోగ్య కేంద్రాలను పరిశీలిస్తున్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించే విధంగా వైద్యులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేస్తున్నారు. వాటిని పాటిస్తూ సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన రోగులు, గర్భిణులు, చిన్నారులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను పూర్తి ఆరోగ్యవంతులుగా చేయడమే కాకుండా, దవాఖాన వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవడం, పారిశుద్ధ్యం, పచ్చదనాన్ని పటిష్ఠంగా నిర్వహించడం చేస్తున్నారు. ఆసుపత్రి గోడలపై రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలకు సంబంధించిన చార్టులను ప్రదర్శించారు. కేంద్ర బృందం పరిశీలనప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు మొదటగా పరిశీలిస్తారు. ప్రధానంగా ఆరోగ్య కేంద్రంలో ఓపీ, ఇన్ పేషెంట్, జనరల్ వార్డు, లేబర్‌వార్డు, ప్రసూతి గది, ఫార్మసి అంశాలను పరిగణనలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు గురించి ఆరా తీస్తారు. వారు నిర్వహించిన సర్వే ద్వారా ఆసుపత్రికి మార్కులు కేటాయిస్తారు. మంచి మార్కులు వస్తేనే జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. అందులో భాగంగానే జిల్లాలో మొత్తం 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, అందులో పదింటిని ఎన్‌క్వాస్ గుర్తింపునకు అనుగుణంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తీర్చిదిద్దారు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించే విధంగా సకల సదుపాయాలు కల్పించి సర్వం సిద్ధం చేశారు. దీంతో సిరిసిల్లలోని పీఎస్‌నగర్, తంగళ్లపల్లి, నేరెళ్ల, కోనరావుపేట, కొదురుపాక, బోయినపల్లి, విలాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. ప్రస్తుతం జిల్లాలో చందుర్తి మండలం లింగన్నపేట, వేములవాడ మండలం హన్మాజిపేట, సిరిసిల్లలోని అంబేడ్కర్‌నగర్ పీహెచ్‌సీలు ఎన్‌క్వాస్ ఎంపిక కోసం సిద్ధంగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. వీటికి కూడా త్వరలో జాతీయ స్థాయి గుర్తింపు లభించనున్నదని పేర్కొంటున్నారు.

మూడేళ్లపాటు నిధులు– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో మొత్తం 17 పీహెచ్‌సీలు ఉండగా అందులో జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించడంతో ఇప్పటికే ఏడు పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ గుర్తింపు వచ్చింది. మిగతా మూడింటికి కూడా త్వరలోనే గుర్తింపు వస్తుంది. చందుర్తి, ఇల్లంతకుంట, పోత్గల్, గంభీరావుపేట, చీర్లవంచ ఆరోగ్య కేంద్రాలు పాతవి కావడంతో వాటిని ఎంపిక చేయలేదు. ఎన్‌క్వాస్‌కు ఎంపికైన ఆరోగ్య కేంద్రాలకు ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా నిధులు అందజేస్తుంది. వాటిని ఆసుపత్రి అభివృద్ధి కోసం వినియోగించడం జరుగుతుంది.

వణుకుతున్న రోగులు

జగిత్యాల : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో జనరల్ ఆసుపత్రితోపాటు మాతాశిశుకేంద్రాల్లో 100 చొప్పున పడకలు ఉండగా కోరుట్ల ఆసుపత్రి స్థాయిని ఇటీవలే 100 పడకల ఆసుపత్రిగా మార్చారు. మెట్‌పల్లిలో 50 పడకల ఆసుపత్రి ఉండగా ధర్మపురి, రాయికల్‌లో 30 పడకల ఆసుపత్రులు ఉండగా భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. జిల్లాలో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా మరో 2 కొత్తగా మంజూరు చేశారు. అందులో తొమ్మిది 24 గంటల ఆరోగ్య కేంద్రాలున్నాయి. జిల్లా కేంద్రంలో తెలంగాణ రోగ నిర్ధారణ కేంద్రం ఉండగా 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అనేక ఆసుపత్రుల్లో, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రుల్లో కిటికీలకు తలుపులు లేక రోగులు చలికి వణుకుతున్నారు. రాయికల్ ఆసుపత్రిలో వైద్యులు సరిగ్గా ఉండక ప్రసవాలు నిలిచిపోయాయి. ఆసుపత్రిలో నీటిసదుపాయం లేక వర్షాకాలం వస్తే ఆపరేషన్ థియేటర్, వార్డులు ఉరుస్తున్నాయి.

ఆరోగ్యం.. పరమం ధనం

ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ఇక నుంచి ఆరోగ్య మందిరాలుగా మార్చాలని యోచిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆరోగ్య కేంద్రాలకు పేరు మార్చాలని సూచించారు. గతంలో వెల్‌నెస్ సెంటర్లు(ఆరోగ్య స్వస్థత కేంద్రాలు) ఏర్పాటు చేశారు. వాటి స్థానంలోనే కొత్తగా 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' అని నామకరణం చేయడంతో పాటు 'ఆరోగ్యం పరమం ధనం' అని పేరు కింద ట్యాగ్‌లైన్ జత చేయాలని సూచించింది. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల పోర్టల్‌లో పేరు మార్పును అప్‌లోడ్ చేయాలని సూచించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయుష్ విభాగం పరిధిలో గతేడాది 12 ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రానికి జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రూ.6 లక్షలు నిధులు మంజూరు చేశారు. స్వస్థత కేంద్రంలో యోగా షెడ్లు నిర్మించారు. ఇక్కడకు వచ్చే వారికి తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం సమకూర్చారు. ప్రకృతి వైద్యంపై శిక్షణ, ఫిజియోథెరపీ వంటి వైద్య చికిత్సలు అందించాల్సి ఉంది.

స్వస్థత కేంద్రాల పనితీరు అంతంతమాత్రమే

జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య స్వస్థత కేంద్రాల పనితీరు అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో వీటిని ఏర్పాటు చేసినా లక్ష్యం మేరకు సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో యోగా శిక్షకులను నియమించాల్సి ఉండగా ఆ ప్రక్రియ ముందుకు సాగనేలేదు. మరోవైపు షెడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. నిర్మించిన ఏడాదికే ఆదరణ కరవై నిరుపయోగంగా మారాయి.

జిల్లాలో ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఆరోగ్య కేంద్రాలివే..

యునాని: భద్రాచలం, పాపకొల్లు(జూలూరుపాడు)
హోమియో: భద్రాచలం, చంద్రుగొండ, ఇల్లెందు
ఆయుర్వేద: ఆర్లగూడెం, భద్రాచలం, అశ్వాపురం, రొంపేడు (ఇల్లెందు), ఆర్.కొత్తగూడెం, నాగుపల్లి (దమ్మపేట), చుంచుపల్లి

మార్పుపై ఉత్తర్వులు అందలేదు..

ఆయుష్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల పేరు మార్పుపై కేంద్రం నుంచి జారీ చేసిన ఉత్తర్వులు ఇంకా అందలేదు. అవి రాగానే పేరు మార్పును పరిశీలిస్తాం. ప్రస్తుతం ఆరోగ్య స్వస్థత కేంద్రాలుగా బోర్డులు దర్శనమిస్తున్నాయి. డాక్టర్ కె.రాజేందర్‌రావు, ఆయుష్ విభాగం ఇన్‌ఛార్జి

చెక్‌పోస్టుల్లో యూపీఐ చెల్లింపులు?

ఖమ్మం : వ్యవసాయ మార్కెట్ల చెక్‌పోస్టుల వద్ద యూపీఐ చెల్లింపుల విధానాన్ని మార్కెటింగ్‌శాఖ పరిశీలిస్తోంది. ఇటీవల మార్కెటింగ్ శాఖ సంచాలకురాలు లక్ష్మీబాయి ఖమ్మం జిల్లాను సందర్శించారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెట్ల ఆదాయం తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది సివిల్ సప్లై నుంచి వచ్చిన బకాయిల కారణంగా ఆదాయం ఎక్కువగా ఉండదని కొంతమంది కార్యదర్శులు చెప్పారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద చెల్లింపుల విషయంలో ఇబ్బందిగా ఉన్న విషయాన్ని ఆమె దృష్టికి తెచ్చారు. ఇప్పటికే వాణిజ్య పన్నుల తనిఖీ కేంద్రాల వద్ద యూపీఐ చెల్లింపులు జరుగుతున్నాయని, అదే విధానం మార్కెటింగ్‌శాఖలోనూ అమలు చేయడం వల్ల ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అనేక మంది ఈ విధానం అమలు చేయాలని కోరుతున్నారని, పరిశీలిస్తామని లక్ష్మీబాయి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సరిహద్దుగా ఉన్నాయి. జిల్లాల్లో ఉన్న చెక్‌పోస్టులను బలోపేతం చేయడంతో పాటు సరిహద్దులో ఉన్న వాటిపై నిఘా పెట్టాలని ఆమె కోరారు. మార్చి నాటికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే ముమ్మర ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ
ఖమ్మం జిల్లా
తనిఖీ కేంద్రం, బోనకల్
KMM-AMC-MDR-33

సరిహద్దు తనిఖీ కేంద్రాలు

ఖమ్మం: బోనకల్లు, ఎర్రుపాలెం, వెంకటాపురం, ముత్తగూడెం
భద్రాద్రి కొత్తగూడెం: అశ్వారావుపేట, వెంకటాపురం సమీపంలోని పూసూరు (ఛత్తీస్‌గఢ్ సరిహద్దు)

బలోపేతం చేసేందుకు సలహాలు, సూచనలు...

చెక్‌పోస్టుల వద్ద యూపీఐ చెల్లింపుల విషయం పరిశీలన
సరిహద్దులో ఉన్న తనిఖీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడం
ప్రతి సరిహద్దు తనిఖీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు
అవసరమైనంత మంది సిబ్బందిని నియమించడం
అంతర్ జిల్లాల మధ్య ప్రయాణిస్తున్న వాహనాల రవాణాపై ప్రత్యేకంగా నిఘా పెట్టడం
మార్కెట్ కార్యదర్శులు రెగ్యులర్‌గా వీటిని పర్యవేక్షించాలి
చెక్‌పోస్టుల్లోని సీసీ కెమెరాలను మార్కెట్ కమిటీ కార్యాలయాలకు అనుసంధానం చేయాలి.

నష్టకష్టాలు

హైదరాబాద్ గ్రేటర్‌లో తొమ్మిది సర్కిళ్లు ఉండగా.. ప్రధానంగా నాలుగు సర్కిళ్లలో అధికంగా సాంకేతికత, వాణిజ్య నష్టాలు ఉన్నాయి. హైదరాబాద్ సౌత్‌లో అత్యధికంగా 41.4 శాతం నష్టాలు ఉన్నాయి. గత ఏడాది 39 శాతానికి తగ్గి.. నష్టాలు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ సెంట్రల్‌లో 12.8, రాజేంద్రనగర్‌లో 10, సరూర్‌నగర్‌లో 9.25 శాతం సాంకేతికత, వాణిజ్య నష్టాలు ఉన్నాయి.

రెండు రకాలుగా..విద్యుత్తు సంస్థ సరఫరా చేసిన కరెంట్ వినియోగదారుడికి చేరేసరికి కొంత వ్యత్యాసం వస్తుంది. దీన్ని సాంకేతికత నష్టాలుగా చూపుతుంటారు. బిల్లింగ్‌లో బకాయిలు, వసూళ్లలో నిర్లక్ష్యం కారణంగా వచ్చే నష్టాలను వాణిజ్య నష్టాలుగా చెబుతుంటారు. ప్రతి మూడు నెలలకోసారి ఎనర్జీ ఆడిట్ విభాగం ఆడిట్ చేసి వీటిని ఆయా సర్కిళ్లు, డివిజన్లకు పంపిస్తుంటుంది. వీటిని అలా చూసి.. ఇలా పడేస్తున్నారు.

ఫీడర్‌వారీగా లెక్కలు ఉన్నా...నష్టాలు డివిజన్లే కాదు.. ఫీడర్‌వారీగా లెక్కలు ఎనర్జీ ఆడిట్‌లో చూపుతున్నారు. హైదరాబాద్ సౌత్‌లోని కొన్ని సెక్షన్లలో 70 నుంచి 90 శాతం నష్టాలు ఉన్న ఫీడర్లు ఉన్నాయి.

సీఆర్‌పీఎఫ్, గుల్జార్‌హౌస్, మైసారం వంటి చోట్ల కరెంట్ సరఫరా చేస్తున్న యూనిట్లకు.. బిల్లింగ్ యూనిట్లకు ఎంతో వ్యత్యాసం ఉంటోంది. వీటిపై దృష్టి పెడితే తగ్గించడం అసాధ్యమేమి కాదని అక్కడ గతంలో పనిచేసిన ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

వాణిజ్య ప్రాంతాల్లో చౌర్యం ఎక్కువగా జరుగుతోందనే ఆరోపణలున్నాయి. కరెంట్ వాడుకుంటున్నా.. మీటర్‌లో నమోదు కావడం లేదు. కాలం చెల్లిన పాత నెట్‌వర్క్ ఉండడం కూడా సాంకేతికత నష్టాలకు కారణమని ఇంజినీర్లు చెబుతున్నారు.

వంద శాతం ఐఆర్‌పోర్ట్ మీటర్లను ఏర్పాటు చేయకపోవడంతో బిల్లింగ్‌లో అక్రమాలకు ఆస్కారం ఉంటోంది.

కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది వినియోగదారులతో కలిసి డిస్కంకు నష్టం చేకూరుస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మీటర్ ట్యాంపరింగ్‌కు ఎక్కువగా పాల్పడుతున్నారు. మీటర్ తిరగకుండా చేస్తున్నారు. ః బిల్లుల వసూళ్లకు వెళితే కొందరు వినియోగదారులు దాడులకు పాల్పడుతుండటంతో ఉద్యోగులు భయపడుతున్నారు. రక్షణ కల్పించాల్సి ఉంది.

అక్కడ పోస్టింగ్ శిక్షగా భావించడం వల్లే సమస్య...

డిస్కంలో ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ సౌత్‌లో నష్టాలు ఉన్నాయి. ఇక్కడికి పోస్టింగ్ అంటే శిక్షగా భావిస్తుంటారు. ఈ భావన పోయేలా సమర్థులైన ఇంజినీర్లను అక్కడ వేయాలి.

కార్పొరేట్ కార్యాలయంలో పలు విభాగాల్లో హోదాకు, సామర్థ్యానికి తగ్గ పనిలేక.. తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయడంలేదనే భావనలో కొందరు ఉన్నారు. వీరి సేవలను వినియోగించుకోవాలి. ఉన్నతాధికారులు వీసీల్లో సమీక్షలు తప్ప.. క్షేత్రస్థాయికి వెళ్లిన సందర్భాలు పెద్దగా లేవు. ఈ పరిస్థితులను మార్చడానికి చర్యలు చేపట్టాలని విద్యుత్తురంగ నిపుణులు పేర్కొంటున్నారు.

సార్.. ఈ అన్నం మీరు తింటారా..?

హైదరాబాద్ : ఉస్మానియా విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యాలతో అధికారులు చెలగాటమాడుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారంలో పురుగులు వస్తున్నా పట్టింపే లేనట్లు వ్యవహరిస్తున్నారు. నిజాం కళాశాల వసతి గృహంలో నాలుగురోజుల క్రితం భోజనం తినేందుకు వచ్చిన విద్యార్థులు అన్నం, కూరల్లో పురుగులను గుర్తించారు. గుడ్డుకూరలో ప్లాస్టిక్ దారాలు వెలికి తీశారు. విద్యార్థులు ఆందోళనలు నిర్వహిస్తే.. "ఆహారంలో పురుగులు మీరే వేసుంటారేమో"నని వార్డెన్ వెటకారంగా మాట్లాడారని విద్యార్థులు వాపోయారు. నిజాం కళాశాలతో పాటు ఉస్మానియా క్యాంపస్, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ కళాశాలల వసతి గృహాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ప్రభుత్వ నుంచి సకాలంలో నిధులు రాకపోవడం వల్లే వసతి గృహాలను నిర్వహించలేకపోతున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

అనారోగ్య సమస్యలు..ఉన్నత చదువులు చదివేందుకు నగరానికి వచ్చిన డిగ్రీ, పీజీ విద్యార్థులు ఓయూ వర్సిటీ పరిధిలోని కళాశాలల వసతి గృహాల్లో వడ్డిస్తున్న ఆహారం సరిగా లేక అర్ధాకలితో అలమటిస్తున్నారు. అనారోగ్యంతో అవస్థలు పడుతున్నారు. విద్యార్థినులైతే వారంలో ఒకసారైనా వైద్యులను సంప్రదించాల్సిన పరిస్థితులున్నాయి. వసతిగృహాలు నిర్వహిస్తున్న అధికారులు బియ్యం, కూరగాయలు, ఇతర సరకులు సరఫరా చేసే గుత్తేదారులకు ఆలస్యంగా బిల్లులు చెల్లిస్తుండటంతో దొడ్డు అన్నం, కూర, సాంబార్ మాత్రమే ఇస్తున్నారు. చిన్నకప్పు కోడికూర ఇస్తున్నారు. సరఫరాదారులకు డబ్బులిచ్చేందుకు బడ్జెట్ లేకపోవడం, విద్యార్థుల నుంచి మెస్ బిల్లులు వసూలులో ఇబ్బందులతోనూ వంటవారికి డబ్బులిచ్చేందుకు కష్టాలు ఎదుర్కొంటున్నారు.



బయట తినే ఆర్థిక స్తోమత లేక..భోజనం నాణ్యంగా లేకపోయినా విద్యార్థులు సర్దుకుపోతున్నారు. అన్నం, సాంబార్‌లో బొద్దింకలు, పురుగులు వచ్చినప్పుడు ఆందోళనలు చేస్తున్నారు. బయట తినేందుకు వెళితే ఒకపూటకే రూ.100నుంచి 200 వరకూ ఖర్చవుతుందన్న ఉద్దేశంతో ఆర్థిక స్తోమత లేక పప్పులేని నీళ్ల సాంబార్‌తోనే సర్దుకుపోతున్న పరిస్థితి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని విద్యార్థినుల వసతి గృహంలో 900మంది విద్యార్థినులకు ఒకే ఆహారశాల ఉంది. నాలుగు అంతస్తులున్న వసతిగృహంలో విద్యార్థినులు మధ్యాహ్నం, రాత్రి భోజనం తినేందుకు కిందకు రావాలి. నిజాం కళాశాల వసతి గృహంలో అల్పాహారంగా పూరీ, మైసూర్ బజ్జీ చేసినప్పుడు వాటిల్లోని నూనెను చూసి భయపడి కొందరు తినడం మానేస్తున్నారు.

మహిళా విశ్వవిద్యాలయంలో అన్నం, సాంబార్ సరిగా లేదని ఫిర్యాదు చేస్తే... తమనే లక్ష్యంగా చేసుకుంటారన్న భావనతో పలువురు తినీతినక రోజులు గడిపేస్తున్న పరిస్థితి నెలకొంది.

అనువుగాని ప్రాంగణం.. ఆడేందుకు కష్టం



పరిగి : గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. ప్రతి పంచాయతీతో పాటు మున్సిపాలిటీల్లోనూ వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు కోట్లాది రూపాయలను వెచ్చించారు. స్థల విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో ప్రాంగణానికి రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు కేటాయించారు. కొన్నిచోట్ల బోర్డులు, స్తంభాలు పాతి వదిలేశారు. ఔత్సాహికులు ఆడేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. దీనికి సంబంధించి పరిశీలనాత్మక కథనం.

తీరని స్థల సమస్య

జిల్లాలోని ప్రతి మండలంలోనూ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు స్థలాల సమస్య వెంటాడుతోంది. రెవెన్యూ అధికారులు పెద్దగా పట్టించుకోని కారణంగా నిర్మాణాలకు ప్రధాన అవరోధంగా మారింది. భూముల ధరలు ఆకాశన్నంటడంతో దాతలు ముందుకు రావడంలేదు.

ఇవిగో ఉదాహరణలు

పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామానికి చెందిన క్రీడా ప్రాంగణం ఊరికి సుమారు మూడు కి.మీ దూరంలో గుట్టల మధ్య ఏర్పాటు చేశారు. స్థలం ఎత్తు పల్లాలను కొంత సరిచేసినా అనువుగా లేదని అక్కడకు వెళ్లడం లేదు.

లఖ్నాపూర్ ప్రాజెక్టు సమీపాన ఏర్పాటు చేసినా మైదానం సరిచేయలేదు. ః జాఫర్‌పల్లిలో రాళ్లు రప్పలతో కనిపిస్తోంది.

కుల్కచర్ల మండలం దాస్యనాయక్‌తండా, ముజాహిద్‌పూర్ గ్రామాలకు సంబంధించిన క్రీడా ప్రాంగణాలు ఆయా గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో గుట్టల మధ్య ఉన్నాయి.

ధారూర్ మండల పరిధిలోని గ్రామాల్లో బోర్డులకే పరిమితమయ్యాయి. నాగసమందర్ గ్రామంలో పెద్దపెద్ద రాళ్ల మధ్య ఏర్పాటుచేశారు. ఈ ప్రాంగణంలో కనీసం నడవలేని స్థితి ఉందని యువకులు పేర్కొన్నారు.

పాఠశాలలోనే సాధన చేస్తాం

గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అధికారులు పాఠశాల వెనుకభాగంలో ఉన్న నాగుల కుంటలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. చేసేది లేక అక్కడా సాధన చేయాల్సి వస్తోంది.

శ్రీశైలం, యువజన సభ్యుడు, అగ్గనూర్

పూర్తి చేసేందుకు కృషి: కృష్ణన్, డీఆర్‌డీఓ

అసంపూర్తిగా ఉన్న ప్రాంగణాలను త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో స్థలాల కొరత కారణంగా కొంత జాప్యం జరిగింది. పంచాయతీల్లో నిధుల లభ్యతను బట్టి వెంటనే పూర్తయ్యేలా చూస్తాం.

బల్దియాలో అక్రమరవాణా

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ రవాణా విభాగంలో దోపిడీ పర్వం సాగుతోంది. ఏళ్లుగా ఒకే కుర్చీలో పాతుకుపోయిన ఉన్నతాధికారులు మరమ్మతులు, డీజిల్ కూపన్ల పేరుతో ప్రజాధనాన్ని దారి మళ్లిస్తున్నారు. కొత్త వాహనాల కొనుగోలు, కార్మికులను విధుల్లోంచి తొలగించడం, ఇతరత్రా కార్యక్రమాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారు. వాటిపై విచారణ జరపాలని ఏళ్లుగా ఉద్యోగుల నుంచి డిమాండ్ వస్తున్నప్పటికీ.. విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలోనే 'రవాణా' వ్యవహారాలు నడుస్తుండటంతో అవినీతికి అడ్డులేకుండా పోయింది. ఇప్పటికైనా నిధుల వ్యయంతో ముడిపడిన విభాగాలను 'విజిలెన్స్' నుంచి వేరు చేయాలని, పారదర్శకతకు జీహెచ్ఎంసీ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

అడుగడుగునా అవకతవకలు..

ఏడాదిగా చెత్త సేకరణ, తరలింపు కార్యక్రమాలను రాంకీ సంస్థ నిర్వహిస్తోంది. అప్పటివరకు జీహెచ్ఎంసీకి చెందిన సుమారు 400 టిప్పర్లు చెత్తను నగరం నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తీసుకెళ్లేవి. వాటి డ్రైవర్లు, సిబ్బంది కలిపి 2వేల మంది కార్మికులు 24గంటలూ పనిచేసేవారు. వాహనాలు పాతవై(15ఏళ్ల జీవితకాలం ముగియడంతో) తుక్కుగా మారాయి. కొన్ని చిన్నపాటి డీసీఎంలు, చెత్తకుప్పలు తొలగించే వాహనాలు మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నాయి. దాంతో క్లీనర్లు, డ్రైవర్లుగా పనిచేసే 1,500 మందిని ముఖ్య రవాణా అధికారి బదిలీ చేశారు. పార్కుల విభాగానికి కేటాయించగా, తమకు అవసరం లేదంటూ చాలా మందిని వెనక్కి పంపారు. చెత్త రవాణా పనిని రాంకీకి అప్పగించడంతో తమకు ఉపాధి దూరమైందని, ఉపాధి చూపాల్సిన బాధ్యత రాంకీ, జీహెచ్ఎంసీపై ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తంచేశారు. మెకానిక్ పని, డ్రైవింగు చేసే తమను పార్కులకు కేటాయించడమేంటని వాపోయారు.

జీహెచ్ఎంసీ సొంతంగా చెత్తను రవాణా చేస్తున్నప్పుడు.. టిప్పర్లను కవాడిగూడ, ఖైరతాబాద్, మలక్‌పేట పార్కింగ్ యార్డుల కేంద్రంగా నడిపించింది. ఇప్పుడు భారీ వాహనాల్లేవు. చిన్నపాటి చెత్తకుప్పలను తొలగించే వాహనాలు 50 నుంచి 70 ఉన్నాయి. మలక్‌పేట, ఖైరతాబాద్ పార్కింగ్ యార్డుల్లో మరమ్మతుల ఖర్చు తగ్గింది. కవాడిగూడలో మాత్రం.. ప్రతినెలా రూ.50లక్షలు మరమ్మతులకు బిల్లులు చెల్లిస్తున్నారని, ఇంజినీరింగ్ ఉన్నతాధికారికి అందులో సగం డబ్బు వెళ్తోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీహెచ్ఎంసీపై.. అప్పులు పెరగడంతో ఉద్యోగుల జీతాలకు నిధులు ఉండట్లేదు. ఈ సమయంలో ఉన్నవి కాదని.. రవాణా విభాగం కొన్న కొత్త వాహనాలు నెలలుగా కూకట్‌పల్లి జోనల్ ఆఫీసులో మూలనపడి ఉన్నాయని ఉద్యోగులు వెల్లడించారు. ఇదే తరహాలో.. విజిలెన్స్ విభాగం పరిధిలోని ప్రకటనలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల పనితీరుపైనా విమర్శలొస్తున్నాయి.

మూడు పార్కింగ్ యార్డుల్లోనూ డీజిల్ దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. రవాణా విభాగం ఇంజినీర్లు, కొందరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సొంత వాహనాలకు బల్దియా డీజిల్ ఉపయోగిస్తున్నారనే విమర్శలున్నాయి. పాలకమండలి ముఖ్య నేతల సొంత వాహనాలకు కూడా జీహెచ్ఎంసీ నుంచే డీజిల్ తరలుతోంది.

నిఘాకళ్లకు నిద్రమబ్బులు!

హైదరాబాద్: శాంతిభద్రతల పర్యవేక్షణలో సీసీ కెమెరాలు పోలీసుల చేతికి అస్త్రాలు. సరైన పర్యవేక్షణ లేకపోవటం.. నిర్వహణలోపంతో నగరంలో వేలాది కెమెరాలు పనిచేయని స్థితిలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. 'నేనుసైతం' ద్వారా ఏర్పాటుచేసిన నిఘా నేత్రాలు మసకబారుతున్నట్టు పోలీసులే అంగీకరిస్తున్నారు.

ఇదీ అసలు లెక్క నగరంలో ఏడు జోన్లు. 71 పోలీస్‌స్టేషన్లు. 36 ఏళ్ల తరువాత నగర కమిషనరేట్ పునర్విభజనతో 11 ఠాణాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. నూతనంగా నియామకాలే లేకపోవడంతో పాతవారితోనే సర్దుబాటు చేశారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, నేరపరిశోధనకు సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడుతున్నారు. మూడేళ్లుగా నగరంలో సీఎస్‌ఆర్, ఎమ్మెల్యే, ఎంపీ నిధులు, సేఫ్‌సిటీ ప్రాజెక్టు, నేను సైతం వంటి కార్యక్రమాలతో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్లు, దుకాణదారులు, వ్యాపారులు కూడా వేలాది కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 8-9 లక్షలు అందుబాటులో వచ్చినట్టు అంచనా. మొదట్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు నాణ్యతలోపం, రాత్రిళ్లు పనిచేయగల సామర్థ్యం లేమితో తరచూ మొరాయిస్తున్నాయి. భారీవర్షాలు, ఈదురు గాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలతో మరమ్మతుకు గురవుతున్నాయి. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల మధ్య తరచూ గొడవలతో కేబుళ్లను తొలగిస్తున్నారు. అక్కడి సీసీ కెమెరాల వైర్లను కత్తిరిస్తున్నారు. వారి వ్యక్తిగత వైరంతో నగరంలో రోజూ 20-30 చోట్ల ఇలాంటి సమస్య తలెత్తుతోందని ఒక పోలీసు అధికారి తెలిపారు. నిర్వాహకులను గుర్తించి మాట్లాడి దారితీసుకొచ్చేందుకు కొన్నిసార్లు రోజుల సమయం పడుతోంద్మన్నారు.

ఇప్పుడేం జరుగుతోందంటే..

చంపాపేట్‌లో సీసీ కెమెరాలు నిర్వహణలోపంతో తరచూ మొరాయిస్తున్నాయి. ఇటీవల ఈ ప్రాంతంలో చోరీ జరిగింది. పోలీసులు అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించినపుడు పనిచేయని విషయం వెలుగుచూసింది. చాంద్రాయణగుట్ట పరిధిలో కొందరు ఆకతాయిలు మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు వారిని గుర్తించేందుకు సేకరించిన ఫుటేజ్ నాసిరకంగా ఉండటం గమనార్హం. నగరంలోని సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల నిర్వహణను ఐటీ సెల్, డ్రోన్స్, కెమెరా మెయింట్‌నెన్స్ ఆర్గనైజేషన్(డి.కేమో) పర్యవేక్షిస్తోంది. ఈ విభాగాల్లో సిబ్బంది కొరతతో పూర్తిస్థాయి దృష్టి సారించలేకపోతున్నట్టు సమాచారం. తాజాగా నగర పోలీసు వార్షిక నివేదిక-2023 విడుదల సందర్భంగా నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి సీసీ కెమెరాల నిర్వహణపై స్పందించారు. జోన్ల వారీగా వాటి నిర్వహణ, పనితీరును పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భవిత కేంద్రాల బలోపేతానికి అడుగులు

కరీంనగర్ : విధివంచితులైన ప్రత్యేక అవసరాల బాలల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 47 చోట్ల భవిత కేంద్రాలు ఉండేవి. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత మరో 14 ఏర్పాటు చేశారు. అందులో బాలలకు సౌకర్యాలు కల్పించినా ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పించలేదు. కొత్తగా ఏర్పాటైన భవిత కేంద్రాల్లో వాటిని సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

ప్రత్యేక బోధన...మానసిక, శారీరక వైకల్యంగల బాలలకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టేందుకు ప్రతి మండల కేంద్రంలో విలీన విద్యా వనరుల కేంద్రాలను(భవిత) ఏర్పాటు చేశారు. ఇక్కడ 21 రకాల వైకల్యాలు గల బాలలకు విద్యతోపాటు స్వతహాగా ఎదిగేందుకు అవసరమైన సేవలను అందిస్తారు. 5-14 ఏళ్లలోపు గల బాలలకు పలు అంశాలు నేర్పించేందుకు విలీన విద్య బోధకులను(ఐఈఆర్పీ) రాష్ట్ర విద్యాశాఖ నియమించింది. ప్రత్యేక అవసరాల పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తూ బోధన చేపట్టడంతోపాటు కదలలేని బాలల ఇళ్లకు వెళ్లి బోధిస్తున్నారు. కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు అందిస్తున్నారు.

కరీంనగర్ కేంద్రంలో ప్రత్యేక అవసరాల
పిల్లలకు బోధిస్తున్న ఐఈఆర్పీ

కమిటీ ద్వారా ఫర్నిచర్ కొనుగోలు..

రాష్ట్ర విద్యా శాఖ ఉమ్మడి జిల్లాకు రూ.7 లక్షలు మంజూరు చేసింది. అవసరమైన సామగ్రి కొనుగోలు ధరలను కూడా రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు నిర్ణయించారు. జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా వాటిని కొనాల్సి ఉంది. ఒక్కో కేంద్రంలో రెండు రౌండ్ టేబుళ్లు, నాలుగు కుర్చీలు, అల్మారా వంటి మొత్తం 33 రకాల పరికరాలు, ఛార్టులు తదితరాలు కొనను న్నారు.

ఒక్కో విద్యార్థికి రూ.500..

ఉమ్మడి జిల్లాలో భవిత కేంద్రాల్లో ఉపకరణాలకు ఒక్కో కేంద్రానికి రూ.500 చొప్పున, హోంబేస్డ్ విద్య నేర్పించేందుకు అవసరమైన ఉపకరణాలకు ఒక్కో విద్యార్థికి రూ.500 చొప్పున, అంధ విద్యార్థులకు బ్రెయిలీ స్టేషనరీకి ఒక్కో విద్యార్థికి రూ.100 చొప్పున నిధులు మంజూరు చేశారు.

నత్తనడకన పనులు

మెట్‌పల్లి : శిథిలావస్థకు చేరిన భవనాలు, ఇరుకు గదులతో గ్రామ సభలు, సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు సరైన వసతులు లేక కాలం వెళ్లదీస్తున్న గ్రామ పంచాయతీల స్థానంలో నూతన భవన నిర్మాణాలకు గతంలో నిధులు మంజూరయ్యాయి. పనులు మందకొడిగా సాగడంతో పంచాయతీల్లో అవే తిప్పలు ఎదురవుతున్నాయి. పంచాయతీల పాలకవర్గం గడువు దగ్గరకొస్తుండడం, బిల్లులు వస్తాయో? రావోనన్న? అనుమానాలతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. పరిపాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం అనుబంధ గ్రామాలు, తండాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఆయా పాలకవర్గాలు పాత భవనాలు, సంఘాల భవనాలు, పాఠశాలల గదుల్లో తాత్కాలిక పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని పాలన సాగిస్తున్నారు. పంచాయతీ సమావేశాలు, గ్రామసభలు తదితర కార్యక్రమాలను నిర్వహించడానికి తగిన వసతి లేక నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల చెట్ల కింద, ఆరుబయట సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యమైన రికార్డులు, మినిట్స్ పుస్తకాలు, తీర్మానాలు, చెక్‌బుక్కులు తదితర రికార్డులను ప్రతి పంచాయతీల్లో వినియోగించాల్సి ఉంటుంది. సొంత భవనాలు లేక వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారగా, క్షేత్రస్థాయిలో అధికారులు, పాలకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే పాత పంచాయతీల్లో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో నూతన పంచాయతీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనుల్లో జాప్యం నెలకొంది.

152 గ్రామాల్లో నిధులు మంజూరైనా..

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 152 పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం కింద 138, ఎస్టీ కాంపోనెంట్ కింద మరో 14 పంచాయతీలకు నిధులు మంజూరు చేశారు. ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షలు కేటాయించారు. మంజూరైన భవనాల్లో ఇప్పటి వరకు 14 పూర్తి కాగా, 88 ప్రగతిలో ఉన్నాయి. 36 భవనాల పనులు ఇంకా ప్రారంభించలేదు. కొన్ని చోట్ల పనులు చేపట్టడంలో జాప్యం ప్రదర్శిస్తుండగా, మరికొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు లేకపోవడం, కొన్ని గ్రామాల్లో స్థల వివాదాలు తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎస్టీ కాంపోనెంట్ కింద మంజూరైన 14 పంచాయతీలకు ఇంకా టెండర్లు పూర్తి కాలేదు.



జిల్లాలో మంజూరు ఇలా..

మంజూరైన పంచాయతీలు	152
పూర్తయినవి	14
ప్రగతిలో ఉన్నవి	88
ప్రారంభం కానివి	36
టెండర్లు పూర్తి కానివి	14

మార్చిలోగా పూర్తికి చర్యలు- దేవరాజ్, డీపీవో

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మార్చిలోగా పంచాయతీ భవనాలన్నీ పూర్తయ్యేలా చూస్తున్నాము. స్థలాల సమస్య ఉన్న చోట స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిష్కారమయ్యేలా కృషి చేస్తున్నాము. ఇంకా ప్రారంభం కాని పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూస్తాము. ప్రగతి దశలో ఉన్న పంచాయతీల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాము. బిల్లుల విషయంలో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని సూచిస్తున్నాము.

జోరా.. సౌర

సింగరేణి : అధిక ఉష్ణోగ్రతలు ఓవైపు ప్రజల్ని ఠారెత్తిస్తుంటే... అదే భానుడి ప్రతాపాన్ని సింగరేణి సంస్థ ప్రయోజనకరంగా మలుచుకుంటోంది! వివిధ ఏరియాల్లో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు కేంద్రాల్లో లక్ష్యంలో నూరు శాతానికి పైగా ఉత్పత్తి నమోదవుతుండటం విశేషం. ఇతర సీజన్లతో పోల్చి చూస్తే కొద్ది వారాలుగా ఆయా యూనిట్లు పూర్తి ఉత్పత్తి సామర్థ్యంలో పనిచేస్తున్నాయి. ప్రతినెలా సగటున కనీసం 89 నుంచి 90 శాతం మధ్య ఉత్పత్తి నమోదవుతుంది. గత వర్షాకాలంలో ఇది 57 శాతంగానే ఉంది. భానుడి జాడ పెద్దగా లేకపోవడమే దీనికి కారణం. గత నెలలో దాదాపు చాలా రోజులు సూరీడు భగభగలాడటంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సౌర యూనిట్లు పూర్తి సామర్థ్యాన్ని అందుకున్నాయి. శతశాతం విద్యుత్తు లక్ష్యాన్ని అధిగమిస్తున్నాయి. సింగరేణి సంస్థ మందమర్రి

(2), కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, రామగుండం-3, భూపాలపల్లి, ఎస్టీపీపీ(2) ప్రాంతాల్లో సౌర విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా జైపూర్‌లోని ఎస్టీపీపీలో నీటిపై తేలియాడే యూనిట్ను 5 మెగావాట్ల సామర్థ్యంతో ప్రారంభించింది. మే నెలలో ఎండలు మండుతుండటంతో అన్ని ఏరియాలు లక్ష్యాన్ని మించి ఉత్పత్తి చేస్తుండడం గమనార్హం. మరో మూడ్రోజులు మిగిలి ఉండగానే 107 శాతం సౌర విద్యుత్తు లక్ష్యం చేరడం గమనార్హం. ఈ నెలలో ఇప్పటి వరకు 2,54,05,600 యూనిట్లకు 2,70,99,539 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయడం విశేషం.

మానేరు తీరం సుందరీకరణ ఎప్పుడో?

సిరిసిల్ల : చరిత్రలో అద్భుతమైన నాగరికతలు.. నగరాలు నదీ తీరాల్లోనే పుట్టుకొచ్చాయి. జిల్లాలోని మానేరు వాగు వెంట గొప్పనగరాలేవి ఏర్పడక పోయినా.. దీనికున్న చారిత్రక నేపథ్యం గొప్పది. దీని ప్రాధాన్యతను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా సుందరీకరించాలని నిర్ణయించారు. రెండేళ్లుగా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మెట్ట ప్రాంతానికి మానేరు ఓ జీవనదిలా ఉంది. దీనిపై మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర జలాశయం వెనక జలాలు సిరిసిల్ల పట్టణం వరకు విస్తరిస్తాయి. సిరిసిల్ల పట్టణం రామప్పగుట్ట నుంచి సాయినగర్ చెక్‌డ్యాం వరకు సుందరీకరించాలని నాలుగేళ్ల క్రితమే ప్రణాళికలు చేశారు. దీనిలో మొదటి దశ రామప్పగుట్ట నుంచి సిరిసిల్ల వంతెన వరకు కరకట్ట నిర్మాణం పూర్తయింది. రెండో దశ వంతెన నుంచి సాయినగర్ చెక్‌డ్యాం వరకు నిర్మించాల్సి ఉంది. దీనికి గతేడాది రూ.38 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభంలోనే నిలిచిపోయాయి. మారిన సాయినగర్ చెక్‌డ్యాం డిజైన్‌లో కలిపి కరకట్టను నిర్మించాలని ప్రణాళికలు మార్చారు.రాజరాజేశ్వర జలాశయం వెనక జలాలు నిలిచే మానేరు వంతెన నుంచి సాయినగర్ వరకు 2.2 కిలోమీటర్ల పొడవునా కరకట్ట నిర్మించాలి. వాగులో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉండటంతో ఎగువ సాయినగర్ వద్ద ఉన్న చెక్‌డ్యాం కాంక్రీటు కట్టలు బలహీనంగా మారి వరదలకు కొట్టుకుపోతున్నాయి. దీని డిజైన్ మార్చాలని రాష్ట్ర చెక్‌డ్యాం సలహా కమిటీ సభ్యుడు విజయ్‌ప్రకాష్ ఇటీవల కోతకు గురైన చెక్‌డ్యాంను పరిశీలించారు. దీని ఎత్తును 150 మీటర్లకు పెంచాలని నిర్ణయించారు. ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని సూచించారు. అప్పుడే ఎగువ నుంచి వచ్చే వరదను చెక్‌డ్యాం తట్టుకుంటుందన్నారు.

కరకట్ట 10 నుంచి 18 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. దీనిలో స్థలాన్ని బట్టి మధ్యలో పిల్లల పార్కులు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, యోగా చేసుకునేలా పార్కులు ఏర్పాటు చేయనున్నారు. కరకట్ట కింది నుంచి మట్టితో కాకుండా వాగువైపు కాంక్రీటు గోడను నిర్మించి మట్టిని నింపనున్నారు.సివిల్, కాంక్రీటు పనులు పూర్తయ్యాక టూరిజం శాఖకు అప్పగిస్తారు. పురపాలిక శాఖతో కలిసి సుందరీకరణ పనులు చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఇప్పటికే వరంగల్‌లోని భద్రకాళి చెరువు సుందరీకరణ పనులు నిర్వహించిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంటు (కూడా)లోని ఇంజినీర్ల బృందం కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లింది. మట్టి కట్ట పనులు పూర్తయితేనే సుందరీకరణ పనులు ప్రారంభించాల్సి ఉంటుంది.

అనుమతి లేక..రెండు కిలోమీటర్ల పైన కరకట్ట నిర్మాణానికి మట్టి కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలో లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకాలకు గనులశాఖ ఎక్కడా అనుమతులు ఇవ్వలేదు. అగ్రహారం గుట్టలకు మట్టి తవ్వకాలపై ఫిర్యాదులు ఉండటంతో అనుమతులు ఇవ్వడం లేదు. బోయినపల్లి మండలంలో అదనపు టీఎంసీ పనుల్లో కాల్వ తవ్వకాల్లో వెలువడుతున్న మట్టిని గనులశాఖ వేబిల్లుతో కరకట్టకు వినియోగించేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ ప్రయత్నం ఫలిస్తే మట్టి ఇబ్బందులు తొలగినట్లే.

వరద నీటి మళ్లింపు ఎలా?

సిరిసిల్ల పట్టణం ఎగువ నుంచి వచ్చే వరద నీరంతా మానేరులోనే కలవాలి. ఇప్పటికే రామప్పగుట్ట నుంచి మానేరు వంతెన వరకు కరకట్ట నిర్మాణంతో వరద నీరు వెళ్లలేక ఆ ప్రాంతమంతా ముంపునకు గురైంది. ఇక్కడ నీటిని తోడేందుకే లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అదే పొరపాటు ఇక్కడా పునరావృతం కాకుండా చూస్తున్నారు. మరోవైపు సిరిసిల్ల పట్టణంలోని ముంపు సమస్యను పరిష్కరించాలని రూ.200 కోట్లతో బాక్స్ డ్రెయిన్ల నిర్మాణానికి జలవనరులశాఖ ప్రణాళికలు చేసింది. పట్టణానికి నాలుగువైపులా పెద్దబోనాల మీదుగా సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారి పక్క నుంచి ఆరెపల్లి వరకు, రగుడు, కలెక్టరేట్ ముందు నుంచి రామప్పగుట్ట, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి నుంచి రగుడు కూడలి, కొత్తచెరువు నుంచి కలెక్టరేట్ వెనక వైపు 22 కిలోమీటర్ల పొడవునా బాక్స్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. నిధుల వ్యయం భారీగా ఉండటంతో ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేస్తున్నారు. ఇది కొలిక్కి వస్తేనే కరకట్ట పనులు ముందుకు సాగే అవకాశం ఉంది.

త్వరలో ప్రారంభిస్తాం

పనులు ప్రారంభించిన మొదట్లో మట్టి కొరత ఏర్పడింది. దీనికి తోడు పనుల్లో స్వల్ప మార్పులు చేయాల్సి వచ్చింది. మంత్రి కేటీఆర్ సూచనలతో త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి

వరద కాల్వపై సమాంతరంగా రహదారి

కరీంనగర్ : గత కొన్నేళ్లుగా నరకప్రాయంగా మారిన గణేశ్‌నగర్ బైపాసు రహదారి స్మార్ట్‌సిటీలో మెరుగు పర్చేందుకు అధిక నిధులు కేటాయించారు. కూలిపోయిన వరదకాల్వ పనులతోపాటు రహదారి నిర్మాణ పనులు చకచకా పూర్తి చేస్తుండటంతో ఆ పనులు తుది దశకు చేరాయి. హైదరాబాద్ రోడ్డు నుంచి నేరుగా కలెక్టరేట్, భగత్‌నగర్ వచ్చేందుకు మార్గం సుగమం కానుండటంతో వాహనాల రద్దీ పెరిగే అవకాశముంది. మూడేళ్ల కిందట సీఎంఏ నిధులతో వరదకాల్వ, రహదారి నిర్మించాలని భావించి పనులు అప్పగించగా.. సదరు గుత్తేదారు కొంతమేర పనులు ప్రారంభించి పత్తా లేకుండా పోయారు. ఆ ప్రాంతవాసుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరగడంతో చివరకు స్మార్ట్ ప్రాజెక్టులో చేర్చి ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చారు. వరదకాల్వపై స్లాబు వేసి రహదారి విశాలంగా మారుస్తుండటంతో ఆ రహదారి గుండా అధిక సామర్థ్యంగల వాహనాలు ప్రయాణిస్తే ఆ స్లాబు తట్టుకుంటుందా? అనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి.

అధికారుల పరిశీలన అవసరం

రహదారి కావడంతో ఏ సమయంలో ఏ వాహనం ఎంత బరువుతో ఆ వైపు వస్తుందో ఊహించడం కష్టంగానే ఉంటుంది. నిత్యం రద్దీగా ఉన్నట్లేయితే ఆ స్లాబుపై మరింత ఒత్తిడి పెరగనుంది. మరో వైపు నిర్మాణ సమయంలోనే పలు ఆటంకాలు వస్తున్నాయి. ఈనెల 17న ఉదయం స్లాబు వేసేందుకు అల్లిన స్టీల్‌పై రెడ్‌మిక్స్ పోయగా వెంటనే కుప్పకూలింది. అప్పటికప్పుడు నీటితో సిమెంటును కడిగారు. ఆ సమయంలో ఆ స్టీల్ ఎక్కడికక్కడే ఊడిపోయి మురుగునీటి కాల్వలో పడిపోయింది. నాణ్యత పరంగా, సామర్థ్యం విషయంలో అధికారుల పరిశీలన అవసరం.

ఉన్నతాధికారులతో చర్చిస్తాం

వరదకాల్వపై స్లాబు, సమాంతరంగా రోడ్డు వేస్తుండగా ఆ వైపు వచ్చే వాహనాల లోడును బట్టీ డిజైన్ చేశాం. అపోహలు రాకుండా ఉన్నతాధికారులతో చర్చించి ఆ వైపు సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తాం. ఏ వాహనాలు వెళ్లాలనే విషయాన్ని నిర్ణయిస్తాం.

ఇంజినీరింగ్ అధికారి, కరీంనగర్ నగరపాలిక స్లాబు సామర్థ్యం ఎంత?

బైపాసు రోడ్డు రెండు వరుసల రహదారిలా మారుతుండగా అందులో 20 ఫీట్ల వెడల్పుతో సుమారు రహదారి మొత్తంలో సగ భాగం వరద కాల్వ ఉంది. అడుగు భాగం, కాల్వ గోడలు, స్లాబు పూర్తిగా సలాక, కాంక్రీట్‌తోనే నిర్మిస్తున్నారు. బైపాసు రహదారి కావడంతో అటుగా టిప్పర్లు, లారీలు అధిక లోడుతో వెళ్లే అవకాశముంటుంది. ఒక టిప్పర్ కనీసం 30 టన్నుల లోడుతో వెళ్తోంది. అలాంటి సమయంలో దాని గుండా ప్రయాణిస్తే ఆ స్లాబు సామర్థ్యం ఉంటుందా? బరువు తగ్గట్లుగా ఉంటుందా అనేది అందరిలో వస్తున్న ప్రశ్న.

లోడుకు అనుకూలంగానే డిజైన్

వరదకాల్వపై స్లాబు వేసి రోడ్డు తరహాలో నిర్మించేందుకు వాహనాల లోడు పరిశీలించిన తర్వాతే డిజైన్ చేశారని ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు. అధిక బరువుతో వాహనాలు వెళ్లే విధంగా స్టీల్ డిజైన్ చేశారని చెబుతున్నారు. డిజైన్ కోసమే ఈ పనులు ఆలస్యమయ్యాయని, లేదంటే ఎప్పుడో పూర్తి చేసే వారని అంటున్నారు. ప్రస్తుతమున్న స్టీల్ స్ట్రాంగ్‌గా ఉందని, ఎంత బరువున్న ఆపుతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి వెడల్పు కోసం వరద కాల్వపై ఎనిమిది ఇంచుల స్లాబు వేస్తున్నారు. ఇలా స్వశక్తి కళాశాల ఎదురుగా కోతిరాంపూర్ ప్రధాన రహదారి సమీపం వరకు నిర్మాణ పనులు చేపట్టారు. మూడు, నాలుగు చోట్ల స్లాబు పూర్తయితే పనులు పూర్తయ్యినట్లే.

వరద కాల్వ నిర్మాణం పూర్తిగా సలాకతో సెంట్రింగ్ చేస్తున్నారు. పలు రకాల సైజులో సలాక అల్లి దానిపై కాంక్రీట్ పోస్తున్నారు. కింద బెడ్‌తో పాటు చుట్టూ గోడలు ఇలాగే నిర్మిస్తుండగా ఈనెల 17న ఉదయం స్లాబు వేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో సెంట్రింగ్ అడుగు భాగం పడిపోవడంతో సెంట్రింగ్ పూర్తిగా ఊడిపోయింది.

నారసింహా.. పనులు సాగవా?

కరీంనగర్ : భక్తుల కోరికలు తీర్చే నారసింహ స్వామి సన్నిధిలోనే పనులు ముందుకు సాగడం లేదు.. బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమలు ఒకడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కిలా ఉంది.. రెండేళ్ల కిందట రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా ఇక్కడికి వచ్చి ఏడాదిలోగా ఆలయ రూపురేఖలు మారిపోవాలని.. భక్తుల కొంగు బంగారమైన స్వామి సన్నిధిలో అభివృద్ధి జాడలే అడుగడుగునా కనిపించాలని ఆదేశాలిచ్చినా కొన్ని పనులు మాత్రమే అరకొరగా సాగుతున్నాయి..ధర్మపురి ఆలయాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేయాలనే ఆశయానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది. మొదటి దఫాలో 10 పనులను ఎంపిక చేసి వాటి కోసం రూ.46.65 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రూ.6.50 కోట్లతో చేపట్టిన సత్రాల గదుల నిర్మాణాలు మాత్రమే తుది దశకు చేరాయి. మిగతా వాటికి సంబంధించి టెండర్లు కొన్నింటికి నిర్వహించగా.. గుత్తేదారులు ఆసక్తిని చూపించకపోవడం, ఇంకొన్ని టెండర్లను కొందరు దక్కించుకున్నా.. పనులు చేపట్టకపోవడం పురోగతికి అడ్డంకిగా మారాయి. ఒక్కో పని కోసం నాలుగైదుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. రెండో విడతలో ఎంచుకున్న పనులకు రూ.16.04 కోట్లు కేటాయించగా.. ఇందులో రూ.15 లక్షల పని మినహా మిగతావన్నింటికి టెండర్ల అవరోధాలే ఉన్నాయి. మూడో దఫాగా రూ.25 లక్షల పనులకు అనుమతి వచ్చింది. మొత్తంగా రూ.62.94 కోట్ల నిధులను ఖర్చు చేసే విషయంలో పురోగతి ఉండటం లేదు.

ప్రత్యేక చొరవ చూపితేనే..ఏళ్లుగా ఆలయం.. ఆలయ పరిసరాల్లో అభివృద్ధిని కళ్లారా చూడాలని ఆశిస్తున్న ధర్మపురి వాసులకు, ఇక్కడికి వచ్చే భక్తులకు నిరాశే ఎదురవుతోంది. భూసేకరణ ఇబ్బందులు ఉన్న పనులు ఆలస్యం చేసినా.. ఇతరత్రా ఎలాంటి అవాంతరాలు, అడ్డంకులు లేని వాటి విషయంలో పాలకవర్గం సహా దేవాదాయశాఖ, జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవను తీసుకోవాల్సిన అవసరముంది. ఆలయ అభివృద్ధి పనుల విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి.. పరుగులు పెట్టిస్తేనే పనులు వేగంగా సాగే అవకాశముంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తరచుగా వస్తూ స్వామివారిని దర్శించుకుంటున్నా.. అభివృద్ధి పనుల పురోగతిపై మాత్రం దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రాజగోపురం సహా ప్రధానాలయాల పునర్నిర్మాణాలు, స్వాగత తోరణాల నిర్మాణాలు, అనుబంధ ఆలయాల పునర్నిర్మాణాల పనులు జరిగితే బృహత్తర ప్రణాళికలో సగం వరకు పనులు పూర్తయినట్లు ఉండేది. కాని పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. పనుల విషయమై ఆలయ ఈవో ఎస్.శ్రీనివాస్‌తో మాట్లాడగా పనులపై పర్యవేక్షణను పెంచుతామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మరోసారి అవసరమైన పనులకు టెండర్లను పిలుస్తామని, పనులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు.

అటకెక్కిన ఆన్‌లైన్..!

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో పురపాలిక ఆదాయానికి గండిపడుతోంది. ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో దాదాపు 29,876 దుకాణాలు ఉన్నాయి. వీటిలో 14,187 దుకాణాలను మాత్రమే అధికారులు ఆన్‌లైన్ చేశారు. ఏటా బల్దియాలకు రూ.కోట్ల ఆదాయం సమకూరాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో భారీగా గండిపడుతోంది.

పెరుగుతున్న దుకాణాలు..

ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల విస్తీర్ణంతో పాటు దుకాణాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఒకప్పుడు రహదారులు, ప్రధాన కేంద్రాలకే పరిమితమైన వ్యాపార సంస్థలు, దుకాణాలు, హోటళ్లు, ఫలహారశాలలు కాలనీల్లోనూ అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో ఆ స్థాయిలో ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, కనీస అవసరాలు కల్పించాల్సిన బాధ్యత పురపాలికపై పడింది. ఈ భారాన్ని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, వస్త్ర దుకాణాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మెకానిక్, వండ్రంగి, వెల్డింగ్, ఎంటర్‌ప్రైజెస్, రైస్‌మిల్లులు, పూల దుకాణాలు, తదితర వ్యాపార సంస్థల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది. వాటిని గుర్తించి ఆన్‌లైన్ చేయడం ద్వారా పన్ను వసూలు చేసి పురపాలికకు ఆదాయాన్ని సమకూర్చాల్సి ఉంది. ఈ విషయంలో అధికారులు అవసరమైన మేర చొరవ చూపటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పురపాలికల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. పూర్తి స్థాయిలో దుకాణాలను ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు.

59 వేల ఎకరాల్లో పంట నష్టం

జగిత్యాల : మండుటెండల సమయంలో రోజుల తరబడి అకాల వర్షాలు కురుస్తూ అన్నదాతలను కుదురుకోనీయకుండా చేస్తున్నాయి. అన్నిరకాల పంటలు చేతికందే తరుణంలో వర్షం, ఈదురు గాలులు, వడగళ్లు విరుచుకుపడి జిల్లా రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తుండగా ధాన్యం సేకరణలో జాప్యం అన్నదాతలను మరింతగా వేధిస్తోంది. అకాల వర్షాలు వెన్నాడుతున్న తరుణంలో ధాన్యం సేకరణలో జాప్యం చాలా గ్రామాల రైతుల పాలిట శాపంగా మారింది. నిరుటికన్నా ఈ యాసంగిలో దాదాపుగా 15 రోజుల ముందుగానే జిల్లాలో ఏప్రిల్ మొదటివారంలోనే వరి నూర్పిడులు ఆరంభమయ్యాయి. ఇప్పటికీ ఆశించినట్లుగా సేకరణ జరగటంలేదు. ధాన్యం దిగుబడి, వరి నూర్పిడులను బట్టి కేంద్రాలను తెరవాల్సి ఉండగా కొన్నిచోట్ల నేతలకోసం ప్రారంభాన్ని వాయిదావేశారు. మరికొన్నిచోట్ల కేంద్రాలను ప్రారంభించిన తరువాత మిల్లుల కేటాయింపు, బస్తాల తరలింపును లారీల గుత్తేదారులకు అప్పగించటం, హమాలీలను కేటాయించటం, గన్నీలను తరలించటం తదితర పనులను చాలా నిదానంగా మొదలుపెట్టారు. వరి నూర్పిడులు ఆరంభమైన వెంటనే సేకరణ ప్రారంభిస్తే ఇప్పటికే చాలాగ్రామాల్లో పెద్దఎత్తున ధాన్యం మిల్లులకు తరలేది. కాగా సేకరణలో జాప్యం వేలాదిమంది రైతులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తోంది. కేంద్రాలన్నీ మట్టి కళ్లాలు కావటం, టార్పాలిన్లు తగినన్ని లేకపోవటం నష్టతీవ్రతను మరింతగా పెంచింది. ఇదే తరుణంలో మార్క్‌ఫెడ్ మొక్కజొన్నల సేకరణను ప్రారంభించకపోవటంతో మక్కలు సైతం వర్షాలకు తడుస్తుండగా పసుపు, కందులు తదితర ఉత్పత్తులు కూడా వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి.

జిల్లాలో నూర్పిడి చేయాల్సిన పంటల్లో అకాలవర్షాలతో నష్టతీవ్రత

రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలోని 19 మండలాల్లోని 32,444 మంది రైతులకు చెందిన వరి, మక్క, నువ్వు, సజ్జ, మామిడి పంటలు 59,794.4 ఎకరాల్లో దెబ్బతిన్నాయని డీఏవో పి.సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి పంపించామని, రైతువారీగా సర్వేచేసి తుది నివేదికను పంపిస్తున్నామన్నారు. మామిడి కాయలు రాలటం, మార్కెట్లో అతి తక్కువగా ధర పలకటంతో జిల్లాలో మామిడికి రూ.90 కోట్లవరకు నష్టం వాటిల్లగా ఇతర పంటల్లోనూ మరో రూ.100 కోట్లకుపైగా పంటలను కోల్పోయారు. ప్రభుత్వం పంటలను కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని పేర్కొన్నా ఎందరికి మంజూరు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పంట నష్టపోయిన మేరకు పరిహారం ఇవ్వాలని, ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని, మక్కల కొనుగోలును ప్రారంభించాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

ఏర్పాటు తలపెట్టిన కేంద్రాలు 419
ఇప్పటి వరకు ప్రారంభించినవి 360
కొనుగోలు ప్రారంభించినవి 25
వరిసాగు విస్తీర్ణం 2.98 లక్షల ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా 5.32 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం 20వేల క్వింటాళ్ల వరకు

ఎక్కడి నిర్మాణాలు అక్కడే!

కరీంనగర్ : ఎండాకాలంలో వర్షం దంచి కొడుతుండటంతో లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వర్షం వస్తే చాలు.. కాలనీలు జలమయమవుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద ఉద్ధృతికి కాల్వలు నిండి రోడ్లపైకి రావడం.. ఇళ్లల్లోకి వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు స్మార్ట్‌సిటీలో ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయించారు. గతేడాది ఏప్రిల్‌లో పనులను ప్రారంభించగా వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. ఆలోగానే వర్షాలు పడుతుండటంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వానలు విరామం ఇవ్వగానే పనులు త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇటీవల కురిసిన వానతో బయటపడిన కొన్ని లోపాలతో కథనం.ప్రణాళిక ప్రకారం పూర్తి చేయకపోవడంతో..

గతంలో ఎక్కడైతే వరద రోడ్డెక్కిందో అక్కడే మళ్లీ రహదారులు నదులను తలపించాయి. ముకరంపుర, కలెక్టరేట్ రహదారి, జ్యోతినగర్‌లోని శివ థియేటర్ ఎస్‌బీఐ ఎదురుగా, కొత్త లేబర్ అడ్డా నుంచి సంతోషిమాత గుడి వైపు, మంకమ్మతోట హెచ్‌పీ పెట్రోల్‌బంకు ఎదురుగా, రాంనగర్ బస్టాపు సమీపంలో, కోతిరాంపూర్ ప్రధాన రహదారి, విద్యానగర్, శ్రీనగర్‌కాలనీ మాచర్ల గార్డెన్ దగ్గర, మంచిర్యాల చౌరస్తాలో, శర్మనగర్‌లో, అమేర్‌నగర్, హుస్సేనీపుర, అశోక్‌నగర్, కట్టరాంపూర్, తిరుమల్‌నగర్, కమాన్ ప్రాంతాల్లో ఎప్పటిలాగే వరద ప్రవహించింది. స్మార్ట్‌సిటీలో వరద కాల్వల పనులను పూర్తి చేయకపోవడంతో అక్కడి నుంచే వరద రోడ్ల మీదకు చేరింది. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయకపోవడంతో సమస్యలు తప్పడం లేదు. కొన్ని చోట్ల ఇప్పటికీ పనులు ప్రారంభించకుండా వదిలేశారు. వర్షాకాలంలోగా సమస్యలు లేకుండా పూర్తి చేయాల్సిన అవసరముంది. లేదంటే ముంపు ముప్పు పునరావృతం కాక తప్పదు.ప్రభుత్వాసుపత్రి ఎదురుగా శర్మనగర్ మీదుగా ప్రవహించే వరద కాలువ పలు చోట్ల శిథిలమైంది. ఆదివారం కురిసిన వర్షానికి నీటి ప్రవాహం అధికమై ఖాళీ స్థలంలోకి వచ్చి వీధులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద చేరి స్థానికులు అవస్థలు పడ్డారు.హుస్సేనీపురలో ప్రధాన రహదారి పక్క నుంచి వెళ్లే వరద కాల్వ వర్షం పడితే చాలు పొంగి పొర్లుతుంది. స్మార్ట్‌సిటీలో నిర్మిస్తామని చెప్పి ప్రణాళికలు చేయగా ఇప్పటికీ అతీగతి లేకపోగా ఆ నీరంతా ఇళ్లల్లోకి వస్తోంది.సప్తగిరికాలనీ, శ్రీనగర్‌కాలనీ పూర్తిగా నీట మునిగింది. ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్ వైపు మీదుగా డ్రైనేజీ నిర్మించకపోవడంతో నీరంతా వెనక్కి వచ్చి రోడ్లపై పారుతుంది. ఈ వైపు పలు చోట్ల అసంపూర్తి కాల్వలు ఉన్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో ఎల్ఐజీ క్వార్టర్స్ వైపు బైపాసు రోడ్డు మీదుగా వరద ప్రవహించాల్సి ఉండగా హనుమాన్ గుడ్డి దగ్గర పనులు నిలిచి పోయాయి. భారీ వర్షం పడితే చాలు నీరంతా ఈ క్వార్టర్స్ వైపు ఉన్న నాలుగైదు ఇళ్లు నీట మునుగుతున్నాయి.

పాతికేళ్ల నుంచి సమస్య..

శర్మనగర్‌లోని వరదకాల్వ పూర్తిగా కూలింది. పాతికేళ్ల నుంచి వరద వస్తూనే ఉంది. మరమ్మతులు చేయాలని పలుమార్లు వినతులు చేసినా పట్టించుకోవడం లేదు. వర్షానికి నీరంతా ఇళ్లలోకి వచ్చింది. బురద పేరుకుపోయింది.

అమరావతి ప్లాట్ల అమ్మకాల్లో కదలిక

ధరలపై ఆరా తీస్తున్న కొనుగోలుదారులు - గజం రూ.5 వేల వరకు పెరిగిన నివాస స్థలాలు

అధికార మార్పు ఖాయమన్న అంచనాలతోనే...

అమరావతి-తుళ్లూరు : రాజధాని అమరావతిలో కొన్నిరోజులుగా ప్లాట్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. కొత్త వ్యక్తులు వచ్చి ప్లాట్ల ధరలు, ఇతర అంశాలపై ఆరా తీస్తున్నారు. రాజధాని పరిధిలోని గ్రామాల్లో నివాస, వాణిజ్య ప్లాట్ల ధరల్లో కదలిక వచ్చింది. ఈ పరిణామం రైతులకు ఊరటనిస్తోంది. పాలకులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా రాష్ట్రానికి అమరావతే రాజధానిగా ఉంటుందన్న భరోసా రావడంతోనే ధరలు పెరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, జనసేన ప్రభుత్వం వస్తుందన్న ధీమాతో కొనుగోలుదారులు రాజధాని బాట పట్టారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో పగలు, రాత్రి తేడా లేకుండా రాజధాని నిర్మాణ పనులు జరిగాయి. అమరావతిలో కార్యాలయాలు స్థాపించడానికి పలు కంపెనీలు ముందుకొచ్చాయి. అమరావతి బృహత్ ప్రణాళికతో అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధానిలో మౌలిక సదుపాయాల పనులు ప్రారంభమయ్యాయి. దీంతో అమరావతి రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల కొనుగోలుకు అప్పట్లో మంచి డిమాండు ఉండేది. వైకాపా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల నిర్ణయంతో అమరావతికి అడుగడుగునా ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు ప్రారంభం నుంచి పరిస్థితులు ఆశాజనకంగా మారడంతో రైతులకు కొంత ఉపశమనం లభించింది.

పెరుగుతున్న భూముల ధరలు : మూడు నెలల క్రితం రాజధాని గ్రామాల్లో ప్లాట్ల కొనుగోలుకు వారానికి ఒక్కరు వచ్చేవారు. ప్రస్తుతం ఆయా గ్రామాలకు రోజూ పదిమంది వరకు వచ్చి ధరలు ఆరా తీస్తున్నారు. నివాస ప్లాట్ల ధర గతంలో కంటే గజానికి రూ.5వేల వరకు పెరిగింది. అయినా అమ్మకాలు మొదలయ్యాయి. వాణిజ్య ప్లాట్ల ధర గజానికి రూ.10వేల వరకు పెరిగి, సుమారు రూ.35-40 వేలు పలుకుతోంది. రోజుల వ్యవధిలోనే ఒక్కసారిగా ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశ్వసనీయతకు మారుపేరు: సీఎం జగన్

గుంటూరు : జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని తన కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లతో సమావేశమయ్యారు. పెన్షన్లు, ఆసరా, చేయూత పథకాలపై అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. జనవరి లో 3, ఫిబ్రవరిలో 1, మొత్తంగా నాలుగు ప్రధానమైన కార్యక్రమాలు చేస్తున్నామ ని, ఎక్కడాకూడా పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి కార్యక్రమానికి ప్రీలాంచ్, లాంచ్, పోస్ట్ లాంచ్ కార్యక్రమాలు ఉంటాయి. అవి సక్రమంగా నడిచేలా కలెక్టర్లు షెడ్యూల్ చేసుకోవాలి. జనవరి నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంచుతాం. రూ.3 వేలకు పెన్షన్ పెంచుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తిగా నెరవేరుస్తున్నాం. విశ్వసనీయతకు ఈ ప్రభుత్వం మారు పేరు అని రుజువు చేస్తున్నామని సీఎం చెప్పారు. “మన ప్రభుత్వం రాకముందు ఎన్నికలకు 2 నెలల ముందు వరకూ పెన్షన్ కేవలం రూ.1000 మాత్రమే ఇచ్చేవారు. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత 2,250 లు చేశాం. ఇప్పుడు రూ.3 వేల వరకూ పెంచుకుంటూ వచ్చాం. నెలకు 40 0 కోట్ల మాత్రమే గత ప్రభుత్వంలో సగటున పెన్షన్ల కోసం ఖర్చు చేసేవారు. ఇప్పుడు నెలకు రూ.1950 కోట్ల ఖర్చు చేస్తున్నాం. మన రాకముందు పెన్షన్ల సంఖ్య 39 లక్షలు, ఇప్పుడు 66 లక్షలు. ప్రతి అడుగులోనూ కూడా ఏ లబ్ధిదారు మిగిలిపోకూడదు, ప్రతి ఒక్కరికీ కూడా మంచి జరగాలి. ఎవ్వరూ కూడా ఇబ్బందులు పడకూడదని ఎప్పుడూ లేని విధంగా వాలంటీర్ - సచి వాలయ వ్యవస్థను గ్రామస్థాయిలో తీసుకు వచ్చాం. ఆదివారమైనా, పండుగైనా సరే ఒకటో తారుఖీన చిక్కటి చిరునవ్వుతో పెన్షన్‌ను ఇంటివద్దే ఇచ్చే పరిస్థితిని, మార్పును తీసుకురాగలిగాం. ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఈ మార్పును తీసుకురాగలిగాం. ఈ మార్పును ఎలా తీసుకు రాగలిగామన్నది ప్రతి గడపకూ తెలియజేయాల్సిన అవసరం ఉంది” అని సీఎం పేర్కొన్నారు.

హైకోర్టులో వైసీపీ సర్కార్‌కు మరో ఎదురుదెబ్బ

అమరావతి,డిసెంబర్ 28: వైసీపీ సర్కార్‌కు హైకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. విశాఖకు కార్యాలయాల తరలింపుపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ప్రభుత్వ లంచ్‌మోషన్ పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. క్యాంపు ఆఫీస్‌ల ఏర్పాటుపై సింగిల్ జడ్జి దగ్గర రైతుల పిటిషన్లు త్రిసభ్య ధర్మాసనానికి పంపారని సీజే ధర్మాసనం ముందు ప్రభుత్వ లాయర్ సుమన్ చెప్పారు. తీర్పు వచ్చే వరకు ఆఫీస్‌లు తరలించవద్దని సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రభుత్వం సమీక్ష చేయలేకపోతుందని లాయర్ వెల్లడించారు. లంచ్‌మోషన్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ లాయర్ చెప్పగా.. ఇందులో అత్యవసరం ఏమీలేదని సీజే ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ జనవరి 2కు హైకోర్టు వాయిదా వేసింది.



మళ్లీ తెరపైకి పెగాసస్..!

భారత జర్నలిస్టుల ఫోన్లలో పెగాసస్.. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటన

పెగాసస్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. అక్టోబర్‌లో యాపిల్ నుంచి హ్యాక్ అలర్ట్‌లు వచ్చిన తర్వాత ఇద్దరు భారతీయ జర్నలిస్టుల ఫోన్లలో తాము పెగసస్ సాఫ్ట్‌వేర్‌ను గుర్తించినట్లు ఎన్‌జీవో అమ్నెస్టీ ఇంటర్నేషనల్ గురువారం ప్రకటించింది.

‘ది వైర్’ పత్రిక ఎడిటర్ సిద్ధార్థ వరదరాజ్ సహా మరో జర్నలిస్టు ఫోన్లను తమ సెక్యూరిటీ ల్యాబ్ పరీక్షించి వాటిల్లో పెగసస్‌ను ఉన్నట్లు తేల్చిందని వెల్లడించింది. ప్రభుత్వ మద్దతుతో జరిగే హ్యాకింగ్‌కు వీరి ఫోన్లు లక్ష్యంగా మారినట్లు యాపిల్ నుంచి అక్టోబర్‌లో సందేశాలు వచ్చాయి. దీంతో వీరు తమ ఫోన్లను అమ్నెస్టీ ల్యాబ్‌కు పంపించారు. దీనిపై అమ్నెస్టీ సెక్యూరిటీ ల్యాబ్ అధిపతి డాన్నా ఓ సియార్భైల్ మాట్లాడుతూ “జర్నలిస్టులు వారి విధులు నిర్వర్తిస్తున్నందుకు చట్టవిరుద్ధంగా వారి వ్యక్తిగత గోప్యత, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై దాడి చేస్తున్నారు. తమ ప్రజల మానహక్కులను కాపాడటంతోపాటు చట్టవిరుద్ధ నిఘా నుంచి రక్షించాల్సిన బాధ్యత ప్రతి దేశంపై ఉంది” అని పేర్కొన్నారు. అక్టోబర్‌లో యాపిల్ సంస్థ నుంచి పలువురు ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులకు హ్యాకింగ్ అలర్ట్‌లు వచ్చాయి. ఆ తర్వాత యాపిల్ దీనిపై వివరణ ఇస్తూ 150 దేశాలకు ఇటువంటి సందేశాలు వెళ్లాయని చెప్పింది. కానీ, అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రిక మాత్రం ప్రభుత్వమే యాపిల్‌పై ఒత్తిడి తెచ్చి ఇటువంటి ప్రకటన చేయించిందని కథనం ప్రచురించింది.

ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్‌వో గ్రూపు పెగాసస్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. ఈ టెక్నాలజీని ఆ సంస్థ ప్రభుత్వాలకు మాత్రమే విక్రయిస్తుంది. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో 2017లో ఎన్ఎస్‌వో నుంచి కొన్ని పరికరాలను కొనుగోలు చేసింది. కేంద్రం మాత్రం పెగాసస్ కొనుగోళ్లను తిరస్కరించలేదు. ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్‌వో గ్రూప్ రూపొందించిన ఈ స్పైవేర్‌ను కొన్ని దేశాలు వినియోగించుకుని.. రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలపై నిఘా పెట్టినట్లు 2021 జులైలో అంతర్జాతీయ మీడియాలో కథనాలు రావడం తీవ్ర దుమారానికి దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు రాజకీయ నాయకులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఇలా దేశంలో దాదాపు 300 మంది ఫోన్లను పెగాసస్‌తో హ్యాక్ చేసినట్లు అప్పట్లో ‘ది వైర్’ కథనం వెల్లడించింది. ఇది తీవ్ర వివాదం రేపడంతో పాటు పార్లమెంట్‌ను కూడా కుదిపేసిన విషయం తెలిసిందే.

విజయకాంత్ ఇకలేరు

ప్రముఖ కోలీవుడ్ నటుడు, డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ (71) ఇకలేరు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ మరణించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు చెన్నైలోని మియాట్ ఇంటర్నేషనల్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇటీవలే తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న విజయకాంత్.. కొన్ని రోజుల క్రితమే డిశ్చార్జి అయ్యారు. అంతలోనే మరోసారి ఆస్పత్రి పాలయ్యారు. ‘కెప్టెన్’ మృతిపట్ల ఆయన అభిమానులు, సినీ ప్రముఖులు దిగ్భ్రాంతికి గురయ్యారు. విజయకాంత్ గతంలో మధుమేహం ఇతరత్రా సమస్యలతోనూ బాధపడ్డారు.

కుటుంబ నేపథ్యం.. విజయకాంత్ 1952 ఆగస్టు 25న మధురై (తమిళనాడు)లో జన్మించారు. ఆయన అసలు పేరు నారాయణన్ విజయరాజ్ అళగర్‌స్వామి. చిత్ర పరిశ్రమలోకి వెళ్లిన తర్వాత విజయకాంత్‌గా మారారు. తల్లిదండ్రులు కె.ఎన్. అళగర్‌స్వామి, ఆండాళ్ అజగర్‌స్వామి. విజయకాంత్‌కు భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరైన షణ్ముఖ పాండియన్ ‘సగప్తం’, ‘మధుర వీరన్’ చిత్రాల్లో నటించారు.

నట ప్రస్థానం.. 27 ఏళ్ల వయసులో విజయకాంత్ తెరంగేట్రం చేశారు. ఆయన నటించిన తొలి సినిమా ‘ఇనిక్కుమ్ ఇలమై’ (1979). ప్రతినాయకుడి పాత్రతోనే ఆయన ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. అప్పటి నుంచి 2015 వరకు నిర్విరామంగా నటించారాయన. 3 షిఫ్టుల్లో పనిచేసేవారు. కెరీర్ ఆరంభంలో కాస్త పరాజయాలు అందుకున్న విజయకాంత్.. ఎస్.ఎ.చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ‘దూరతు ఇడి ముళక్కం’, ‘సత్తం ఓరు ఇరుత్తరై’లతో విజయాలు అందుకున్నారు. ఆయన నటించిన సినిమాల సంఖ్య 150కి పైగానే. 1984లో ఆయన నటించిన 18 సినిమాలు విడుదలవడం విశేషం. పోలీసు అధికారిగా 20కి పైగా సినిమాల్లో కనిపించారు. ఆయన నటించిన ఆఖరి సినిమా ‘సగప్తం’ (2015). విజయకాంత్ తన సినిమాల్లో ఏదో ఒక సందేశం ఉండేలా చూసుకునేవారు. దేశభక్తి సినిమాలైనా, గ్రామీణ నేపథ్య చిత్రాలైనా, ద్విపాత్రాభినయం చేయాలన్నా విజయకాంత్ అందరికంటే ముందుండేవారు. మరోవైపు కమర్షియల్ చిత్రాల్లోనూ సందడి చేసేవారు. ఇతరుల్లా కాకుండా ఆయన పారితోషికాన్ని ముందుగా తీసుకునేవారుకాదట. తనతో సినిమా నిర్మించే నిర్మాతలు ఆర్థిక సమస్యల్లో ఉన్నారని తెలిస్తే వారి నుంచి రెమ్యునరేషన్ తీసుకునేవారు కాదట.

విప్లవ కళాకారుడు.. తన కెరీర్‌లో విజయకాంత్ కేవలం తమిళ చిత్రాలే తప్ప ఇతర భాషల్లో నటించలేదు. కానీ, ఆయన సినిమాలు తెలుగు, హిందీలో డబ్ అయి అక్కడా మంచి విజయాలు సాధించాయి. ‘శివప్పు మల్లి’ (ఎర్ర మల్లెలు రీమేక్), ‘జదిక్కొరు నీధి’ తదితర చైతన్యవంతమైన సినిమాల్లో నటించడంతో కోలీవుడ్‌లో ముందుగా ఆయన్ను ‘పురట్చి కలైంజ్ఞర్’ (విప్లవ కళాకారుడు) అనేవారు. తర్వాత అభిమానులంతా ‘కెప్టెన్ విజయకాంత్’గా పిలుచుకోవడం మొదలుపెట్టారు. ఆయన వందో చిత్రం ‘కెప్టెన్ ప్రభాకరన్’ బాక్సాఫీసు వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడమే అందుకు కారణం.

ఇతర స్టార్ నటులతో కలిసి.. కోలీవుడ్‌లో తెరకెక్కిన తొలి 3డీ చిత్రం విజయకాంత్ నటించిన ‘అన్నై భూమి’. ఇందులో ఆయన రాధారవి, కన్నడ నటుడు టైగర్ ప్రభాకర్‌తో కలిసి నటించారు. ‘ఈట్టి’లో కన్నడ నటుడు విష్ణువర్ధన్‌తో, ‘మనకనక్కు’లో కోలీవుడ్ నటుడు కమల్‌హాసన్‌తో, ‘వీరపాండియన్’లో తమిళ నటుడు శివాజీ గణేశన్‌తో కలిసి తెరను పంచుకున్నారు. ఒకానొక సమయంలో రజనీకాంత్, కమల్‌హాసన్‌లకు విజయకాంత్ గట్టి పోటీనిచ్చారు.

నిర్మాత, దర్శకుడిగా.. విజయకాంత్ దర్శకత్వం వహించిన ఒకే ఒక చిత్రం ‘విరుధగిరి’. అందులో ఆయనే హీరో. తన బావ ఎల్.కె. సుధీశ్‌తో కలిసి ‘వల్లారసు’, ‘నరసింహ’, ‘సగప్తం’ తదితర చిత్రాలను నిర్మించారు. 1994లో ‘తమిళనాడు స్టేట్ ఫిల్మ్ ఆనరరీ అవార్డు’ (ఎంజీఆర్ పురస్కారం), 2001లో ‘కళైమామణి అవార్డు’ (తమిళనాడు ప్రభుత్వం) అందుకున్నారు. 2001లో ‘బెస్ట్ ఇండియన్ సిటిజెన్ అవార్డు’, 2009లో ‘టాప్ 10 లెజెండ్స్ ఆఫ్ తమిళ్ సినిమా అవార్డు’, 2011లో ‘ఆనరరీ డాక్టరేట్’ (ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చర్చ్ మేనేజ్‌మెంట్) పొందారు. పలు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు.

అలా రాజకీయాల్లోకి.. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2005లో డీఎండీకే పార్టీని స్థాపించారు. 2006, 2011 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. 2016 ఎన్నికల్లో పరాజయం పొందారు.

ఆయనో లెజెండ్.. విజయకాంత్ మృతిపై మోదీ సంతాపం

కోలీవుడ్ నటుడు, డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపై ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. విజయకాంత్ మరణం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అలాగే విజయకాంత్ అంత్యక్రియలను తమిళనాడు ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. నేడు సంతాప దినంగా ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని థియేటర్లలో సినిమా షోలను రద్దుచేసింది. మరోవైపు సినీ, రాజకీయ ప్రముఖులంతా ఆయన మృతిపై సంతాపం తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

విజయకాంత్ మరణం బాధాకరం. తమిళ చలనచిత్ర పరిశ్రమలో ఆయనో లెజెండ్. తన నటనతో కోట్లమంది అభిమానులను సొంతం చేసుకున్నారు. రాజకీయ నాయకుడిగా ప్రజా సేవలో నిమగ్నమయ్యారు. తమిళనాడు రాజకీయాలను ప్రభావితం చేశారు. నాకు మంచి మిత్రుడు. ఆయన లేరనే విషయాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉంది. ఆయన కుటుంబానికి, అభిమానులకు, అనుచరులకు సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి– **ప్రధాని మోదీ**

%డీఎండీకే అధ్యక్షుడు, సినీ నటుడు విజయకాంత్ మరణం గురించి తెలిసి బాధపడ్డాను. అభిమానులంతా ఆప్యాయంగా కెప్టెన్ అని పిలుచుకునే విజయకాంత్ అద్భుతమైన పాత్రలతో ప్రజల్లో దేశభక్తిని పెంపొందించారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి.– అమిత్ షా

మన ‘పురట్చి కలైంగర్’, ‘కెప్టెన్’ విజయకాంత్ ఇకలేరని తెలిసి గుండె తరుక్కుపోయింది. ఆయన గొప్ప వ్యక్తి. మాస్ హీరో. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. తెలివైన రాజకీయ నాయకుడు. ప్రత్యక్షంగా తెలుగు చిత్రాల్లో నటించనప్పటికీ.. ఇక్కడ కూడా ఎంతోమంది అభిమానుల ప్రేమను పొందారు. ఇప్పుడు తిరిగిరాని లోకాలకు వెళ్లి శూన్యాన్ని మిగిల్చారు. ఆయన అభిమానులకు, కుటుంబసభ్యులకు నా సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా

– చిరంజీవి

నా మిత్రుడు, దిగ్గజ నటుడు విజయకాంత్ మృతి చెందడం బాధాకరం. మేం చెన్నైలో ఉన్నప్పుడు ఆయనతో లెక్కలేనన్ని క్షణాలు గడిపాను. ఎంతో స్నేహంగా ఉండేవాళ్లం. ఆయనతో బంధం నా జీవితంలో ఓ ముఖ్యమైన భాగం. ఆయన అభిమానులకు, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢసానుభూతి. **– మోహన్‌బాబు**

నా సోదరుడు, డీఎండీకే అధ్యక్షుడు, విలక్షణ నటుడు విజయకాంత్ మరణవార్త తీవ్ర విషాదాన్ని నింపింది. తమిళనాడు రాజకీయాల్లో వినూత్న ఆలోచనలతో ముందుకు సాగారు. నిర్భయం, ధైర్యం అతడి లక్షణాలు. సినీ, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన విప్లవ కళాకారుడు. విజయకాంత్ జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన అభిమానులకు సానుభూతి తెలియజేస్తున్నా

– నటుడు కమల్ హాసన్

విజయకాంత్‌గారి మరణ వార్త బాధాకరం. సినిమా, రాజకీమాల్లో ఆయన ఓ పవర్‌హౌస్. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా. **– ఎన్టీఆర్**

కెప్టెన్ ఆత్మకు శాంతి కలగాలి. ఆయన కుటుంబానికి నా సానుభూతి. ఆయనతో నా అనుబంధం ఎప్పటికీ మరచిపోలేను **– త్రిష**

గొప్ప వ్యక్తిని కోల్పోయాం. విజయకాంత్ మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. కెప్టెన్‌గా ఎంతోమంది హృదయాల్లో సుస్థిరస్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని ప్రార్థిస్తున్నా. ఆయన కుటుంబానికి, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు నా ప్రగాఢ సానుభూతి**– నటి ఖుష్బూ**

మనసున్న మనిషి. మహానుభావుడు విజయకాంత్ ఇకలేరన్న నిజాన్ని నమ్మడం కష్టంగా ఉంది. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేసుకుంటున్నాను

– రచయిత పరుచూరి గోపాలకృష్ణ

విజయకాంత్ గారి మరణం విచారకరం. ఆయన జ్ఞాపకాలతో ఆయన కుటుంబసభ్యులు సాంత్వన పొందాలని కోరుకుంటున్నా – రవితేజ

నా మొదటి సినిమానే విజయకాంత్‌తో కలిసి నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఎన్నో సలహాలిచ్చారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా. **– సోనుసూద్**

విజయకాంత్ గారు ఇకలేరని వార్త జీర్ణించుకోలేకపోతున్నా. నా చిన్నతనమంతా ఆయన సినిమాలు చూస్తూ గడిపాను. ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాతో ఎప్పుడూ చాలా అభిమానంతో మాట్లాడేవారు. చిత్రపరిశ్రమలో ఆయన నిజమైన నాయకుడు **– మంచు విష్ణు**

సమర్థవంతంగా పని చేశాం.. 2023లో నేరాలు తగ్గాయి: ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

గుంటూరు : ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసిందని.. ఫలితంగానే నేరాలు తగ్గాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో ఇయర్ ఎండింగ్ ప్రెస్ మీట్ నిర్వహించి.. ఈ ఏడాది నమోదైన నేర గణాంకాల్ని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో నేరాల శాతం క్రమంగా తగ్గుతూ వస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది హత్యలు తగ్గాయి. అలాగే దొంగతనాలు తగ్గాయి. టూ వీలర్ దొంగతనాలు తగ్గాయి. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గ్యాంగులను పట్టుకున్నాం. జిల్లా ఎస్పీ నుండి కానిస్టేబుల్, హోమ్ గార్డుల వరకూ తమ కర్తవ్యాన్ని సమర్థవతంగా నిర్వర్తించారు అని కిందిస్థాయి ఉద్యోగుల్ని అభినందించారాయన. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాం. బ్లాక్ స్పాట్స్ గుర్తించి నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలపై ప్రమాదాలు తగ్గేలా చేశాం. 7.83 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయి అని అన్నారాయన. మహిళలపై తీవ్ర నేరాలను భారీగా తగ్గించాం. మహిళలపై 168 మేజర్ కేసులను నేరుగా జిల్లా ఎస్పీలకు కేటాయించి పరిష్కరించాం. రేప్, పోక్సో, డౌరీ డెత్, మహిళా హత్యలపై జరిగిన నేరాలకు జీవిత ఖైదు శిక్షలు పడ్డ కేసులు 57.. 20ఏళ్లు శిక్ష పడిన కేసులు 49.. పదేళ్లు శిక్ష పడిన కేసులు 41.. ఏడేళ్లు శిక్ష పడినవి 15 కేసులు ఉన్నాయి. అలాగే.. వరకట్నం, పోక్సో కేసులు భారీగా తగ్గాయి. ఎస్సీ, ఎస్టీ కేసులు 15.2 శాతం తగ్గాయి. లోక్ అదాలత్ లో 4,01,748 పెట్టీ కేసులు పరిష్కారం అయ్యాయి. సైబర్ నేరాలు గణనీయంగా 25శాతం తగ్గాయి. సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయడం మంచి ఫలితాలనిచ్చింది. ఎక్కువ సైబర్ నేరాలకు పాల్పడిన వారు రాజీకి వచ్చి క్షమాపణలు చెప్తున్నారు. బ్యాంకుల సమన్వయంతో సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేస్తున్నాం. యంగ్ ఆఫీసర్లకు సైబర్ నేరాల అరికట్టేందుకు అవసరమైన ట్రైనింగ్ ఇస్తున్నాం. రౌడీ షీటర్స్ పై ఉక్కుపాదం మోపుతున్నాం. మొత్తం 4 వేలమందిలో 1000 మంది జైల్లో ఉన్నారు. ఈ ఏడాదిలోనే 900 మంది రౌడీషీటర్లు కన్విక్ట్ అయ్యారు. 200 మందిపై పీడీ యాక్ట్ లు నమోదు చేశాం. 10వేల ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం. గంజాయి సాగు చేసేవారికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం 2లక్షల 52వేల ఎకరాలను ట్రైబల్స్ కు అందించింది. గంజాయి పెడలర్స్, స్మగ్లర్, కన్జ్యుమర్స్ ఎవరినీ వదిలి పెట్టట్లేదు. ఈ మూడేళ్లలో 5లక్షల కేజీల సీజ్డ్ గంజాయిని ధ్వంసం చేశాం. ఏపీలో మావోయిస్టుల కదలికలు కూడా తగ్గాయి. క్రైమ్ గణాంకాలతో పాటు పోలీసుశాఖలో తీసుకున్న సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అంశాలపైనా డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు.



యానిమల్ బ్యూటీ ట్రిప్తీ దిమ్రీ ఎఫైర్ కహానీ

సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్ చిత్రం సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయాన్ని మించి ఇందులో నటించిన తారలకు గొప్ప పేరొచ్చింది. ఇందులో అతిథి పాత్రలో నటించి త్రిప్తి డిమ్రీ అందచందాలు, ప్రతిభ అందరి దృష్టిని ఆకర్షించాయి. రణబీర్ కపూర్ సరసన ఈ చిత్రంలో సహాయక పాత్రను పోషించింది. అయితే ఈ పాత్ర దేశవ్యాప్తంగా కీర్తిని సంపాదించడంలో సహాయపడింది. యానిమల్ బ్యూటీని నేషనల్ క్రష్ అని పిలవడం ట్రెండ్ గా మారింది. అదే సమయంలో ట్రిప్తి పాత ఎఫైర్ల గురించి ఇప్పుడు మీడియాలో పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువడుతున్నాయి. అనుష్క శర్మ సోదరుడు కర్ణేష్ తో ప్రేమాయణం సాగించి బ్రేకప్ అయిన ఈ బ్యూటీ ఆ తర్వాత సామ్ మర్చంట్ అనే వ్యాపారవేత్త కం మోడల్ తో డేటింగ్ చేస్తున్నట్లు పుకారు వచ్చింది. ఓ వివాహ వేడుకలో అతడితో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను పోస్ట్ చేసిన తర్వాత పుకార్లు మొదలయ్యాయి. అయితే ఇవి అవాస్తవమని తెలుస్తోంది. ఇటీవలి ప్రముఖ న్యూస్ పోర్టల్ వెలువరించిన కథనం ప్రకారం.. ఈ డేటింగ్ నిజం కాదని వెల్లడైంది. ట్రిప్తి డిమ్రీ ఒకప్పుడు నటి అనుష్క శర్మ సోదరుడు కర్నేష్ శర్మతో

డేటింగ్ చేసింది. ఈ జంట తమ సంబంధాన్ని అధికారికంగా ఎప్పుడూ అంగీకరించలేదు. వీరిద్దరూ ఇక కలిసి లేరని తాజాగా తేలింది. తాజా వార్తా కథనంలో ఇలా రాసారు. ట్రిప్తీ-సామ్ ప్రేమాయణం కేవలం పుకారు మాత్రమే. ట్రిప్తీ ఒంటరిగా ఉంటోంది. కొందరి మనసులు ఊహాశక్తిని కలిగి ఉంటాయి. ట్రిప్తి సామ్‌తో ప్రేమలో ఉందని ప్రచారం చేసేవారిని నిందించలేం. ఇలాంటివి సాధారణం.. బాలీవుడ్‌లోనే కాదు.. ఈ రోజుల్లో అన్ని రంగాల్లోనూ ఇలాంటివి వింటున్నాం అని సోర్స్ పేర్కొంది. ట్రిప్తి కూడా ఈ మధ్య తాను ఒంటరిగా ఉన్నానని సదరు పోర్టల్ ఇంటర్వ్యూలో అంగీకరించింది. సామ్ మర్చంట్ గోవాలో వాటర్స్ బీచ్ లాంజ్ & గ్రిల్‌ను స్థాపిం చిన హెటల్ వ్యాపారి. అతడు ఉత్సాహభరితమైన ప్రయాణీకుడిగా తన ప్రయాణాల గురించి బ్లాగ్ లో రాస్తాడు. దాదాపు 249k అనుచరులను కలిగి ఉన్నాడు. సామ్‌ను ట్రిప్తీతో పాటు సెలబ్రిటీలు టైగర్ ష్రాఫ్, దిశా పటానీ అనుసరిస్తున్నారు. యానిమల్‌లో జోయాగా నటించిన ట్రిప్తీకి సినిమా విడుదలైన కొద్ది రోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్ 4 మిలియన్లకు చేరుకుంది. 40లక్షల మంది అనుచరులు ఉన్నారు ఇప్పుడు. యానిమల్ లో రణబీర్‌తో సన్నిహిత సన్నివేశాలు విమర్శలకు దారితీసినప్పటికీ ట్రిప్తీ స్పందిస్తూ -ఆ సన్నివేశాలు అసభ్యంగా ఉండవని సందీప్ సర్ హామీ ఇచ్చాకే నటించానని తెలిపింది. అవి రసవత్తరంగా అందాన్ని ఎలివేట్ చేస్తూ చిత్రీకరించినవి. ఒకవేళ నేను సౌకర్యంగా లేకుంటే ఆ సీన్లు చేయడానికి వేరే మార్గం గురించి ఆలోచిస్తాము అని సందీప్ అన్నారు అని తెలిపింది.

'నా సామిరంగ'.. నాగ్ రంగంలోకి దిగాల్సిందే..

కింగ్ నాగార్జున గత కొద్ది సంవత్సరాలుగా ప్రతీ సంక్రాంతికి కచ్చితంగా తన సినిమా ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నాడు. ఈసారి కూడా అదే ప్లాన్ తో 'నా సామి రంగ' షూటింగ్ ని పరుగులు పెట్టిస్తున్నాడు. ప్రతి సంక్రాంతికి ఓ బ్లాక్ బస్టర్ ని తన అభిమానులకు ఇవ్వాలని డిసైడ్ అయిన ఈ సీనియర్ హీరో తన సినిమా రిలీజ్ ని సంక్రాంతి నుండి వేరే డేట్ కి మార్చేందుకు ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న 'నా సామి రంగ' మూవీ అల్లరి నరేష్, రాజ్ తరుణ్ వంటి ప్రధాన తారాగణంతో ఓ మాస్ కమర్షియల్ ప్యాకేజీగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. అనుకున్న టైం కి షూటింగ్ పూర్తి చేసేందుకు మూవీ టీం చాలా కష్టపడుతుంది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కూడా ఆడియన్స్

నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అంతా బాగానే ఉంది కానీ ఈ సినిమాకి తాజాగా ఓ పెద్ద సమస్య వచ్చిపడింది. అదేంటంటే, 'నా సామిరంగ' మూవీకి సరిపడా థియేటర్స్ దొరకడం లేదట. %జ, ఐ% సెంటర్లలో ఇప్పటికే ఇతర సినిమాల కోసం అన్ని థియేటర్స్ లాక్ చేయబడ్డాయి. అటు %ూ,దీ% సెంటర్స్ లో కూడా పెద్దగా థియేటర్స్ దొరకడం లేదని లేటెస్ట్ టాక్ వినిపిస్తోంది. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న నాగార్జున ఈ విషయాన్ని తాజాగా నిర్మాతలకు తెలిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో రంగంలోకి దిగిన ప్రొడ్యూసర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ సమస్యను పరిష్కరించేందుకు అలాగే రిలీజ్ డేట్ ప్లానింగ్ గురించి చర్చలు జరిపేందుకు సమావేశం అవుతున్నట్లు తెలిసింది. మరి ఈ సమావేశంలో చర్చలు సఫలమై నాగార్జున నా సామి రంగ సినిమాకి ఎక్కువ థియేటర్స్ దొరుకుతాయేమో చూడాలి. కాగా సంక్రాంతి బరిలో 'నా సామి రంగ' తో పాటు 'గుంటూరు కారం', 'సైంధవ్', 'ఈగల్', 'హనుమాన్' వంటి సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఇక నా సామిరంగ సినిమా విషయానికొస్తే.. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సినిమాలో నాగార్జున సరసన ఆషిక రంగనాథ్ హీరోయిన్ గా నటిస్తోంది. అల్లరి నరేష్, రాజ్ తరుణ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. చిట్టూరి శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

ఆపరేషన్ వాలెంటైన్.. ప్లాన్ క్లిక్కయినట్లే

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ప్రస్తుతం ఆపరేషన్ వాలెంటైన్ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్గా తెరకెక్కుతున్న ఈ మూవీలో వరుణ్కు జోడీగా మిస్ వరల్డ్ మానుషీ చిల్లర్ హీరోయిన్గా నటిస్తోంది. మూడు రోజుల క్రితం.. ఫస్ట్ స్ట్రైక్ పేరుతో మేకర్స్ ఈ సినిమా టీజర్ను విడుదల చేశారు. అయితే కంప్లీట్ యాక్షన్ కట్తో అదిరిపోయిన ఈ సినిమా టీజర్ సూపర్ వ్యూస్తో దూసుకుపోతోంది. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి విడుదలైన టీజర్ ఇప్పటి వరకు 20 మిలియన్లకుపైగా వ్యూస్ పొందింది. నేషనల్ వైడ్గా తెలుగు, హిందీ భాషల్లో ఫుల్ ట్రెండింగ్లో ఉంది. భారతదేశంలోని వైమానిక దళంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో వరుణ్, మానుషి జెట్ ఫైటర్స్గా కనిపించబోతున్నారు. ఈ సినిమా టీజర్లో యుద్ధ విమానాల విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. టీజర్లో ఇండియాపై ఓ భీకర దాడి జరిగినట్లు చూపించారు. ఆ తర్వాత దీనికి బదులుగా భారత్ అతిపెద్ద వైమానిక దాడి చేసినట్టు వీడియో చుస్తే స్పష్టం అవుతోంది. స్ట్రాంగ్ ప్రెజెన్స్తో వరుణ్ పవర్ఫుల్ డైలాగ్స్ చెబుతూ ఐఏఎఫ్ ఆఫీసర్గా ఔరా అనిపించారు. మానుషి కూడా తన క్యూట్ లుక్స్తో ఆకట్టుకుంది. అయితే ఈ టీజర్తో భారీ అంచనాలు క్రియేట్ చేశారు మేకర్స్. తెలుగు, హిందీ భాషల్లో దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఆయన ఈ సినిమాతోనే డైరెక్టర్గా పరిచయమవుతున్నారు. ఈ మూవీని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఫిబ్రవరి 16న విడుదల చేయనున్నాయి. వరుణ్.. ఈ మూవీతో బాలీవుడ్లో అడుగుపెడుతున్నారు. మరోవైపు పలాస 1978 ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వం తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా సినిమా మట్కాలో కూడా నటిస్తున్నారు వరుణ్ తేజ్. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. వరుణ్ తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఈ మూవీ రాబోతుంది. ఇటీవలే తన సతీమణి లావణ్య త్రిపాఠితో కలిసి హనీమూన్కు వెళ్లిన వరుణ్.. ప్రస్తుతం తన మూవీ షూటింగ్లో బిజీగా మారారు.

సంపుతున్న సయీ మంజ్రేకర్

టాలీవుడ్ లో వరుస చిత్రాల్లో నటించింది సయీ మంజ్రేకర్. సల్మాన్ 'దబాంగ్ 3'లో నటించిన ఈ బ్యూటీ ఆ తర్వాత తెలుగు హీరో అడివి శేష్ సరసన 'మేజర్' లాంటి పాన్ ఇండియా చిత్రంలో నటించింది. మేజర్ అన్ని భాషల్లో మంచి విజయం సాధించింది. ఆ తర్వాత సయీ ముఖర్జీ రామ్ సరసన బోయపాటి చిత్రం స్కంధలో నటించింది. కానీ ఈ చిత్రంతో ఆశించిన విజయం దక్కలేదు.. కానీ సయీ అందచందాలు నటనకు మంచి పేరొచ్చింది. మరోవైపు సోషల్ మీడియాలలో సయీ స్పీడ్ మీద ఉంది. నిరంతరం నటవారసురాళ్లతో పోటీపడుతూ రేస్ లో దూసుకెళుతోంది. సయీ తాజాగా డెనిమ్ ఫ్యాంట్, డెనిమ్ టాప్ లో దుమ్ము లేపిన ఒక వీడియో అంతర్జాలంలో వేడెక్కిస్తోంది. సయీ సింపుల్ గా స్మైలిస్తూ వీడియో షూట్ లో పాల్గొంది. ప్రస్తుతం ఈ అరుదైన విజువల్ యువతరంలో వైరల్ గా మారింది. సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు డిజిటల్ గా పాపులారిటీని పెంచుకునే ప్రయత్నంలో ఉంది ఈ బ్యూటీ.

పంజాబీ సినిమాలో గురు రంధవా సరసన: పాపులర్ పంజాబీ గాయకుడు గురు రంధవా ఆలపించిన గ్రూవీ సాంగ్ లో సయి మంజ్రేకర్ కనిపించింది. 'కుచ్ ఖట్టా హెూ జాయ్' చిత్రంలోని 'బాట్లీ ఖోలో' పాటను నిర్మాతలు ఆవిష్కరించగా ఈ పాటలో గురు రంధవాతో కలిసి సయీ అద్భుతమైన నృత్యం చేసింది. ''బాటిల్ తెరిచి ఉంది.. సంగీతం ఆన్‌లో ఉంది - #KuchKhattaaHoJaay సాంగ్ అవుట్ నౌ.. మా కొత్తగా విడుదల చేసిన # BotleyKholo పాటకు డ్యాన్స్ చేయడానికి సమయం ఉంది'' అని రంధవా వ్యాఖ్యానించారు. పాట విడుదలైన వెంటనే, అభిమానులు , ఫాలోవర్లు కామెంట్లతో విరుచుకుపడ్డారు. ఈ పాటలో నా జీవితం మొత్తం ఉంది! అంటూ ఒక అభిమాని చిల్ అయ్యాడు. బాట్లీ ఖోలో పాట బ్లింగ్‌తో నిండిన పెప్పీ నంబర్. దీనిని మీట్ బ్రోస్ కొరియోగ్రాఫ్ చేయగా గురు రంధవా పాడారు. సాహిత్యం స్టార్‌బాగ్ లాక్. గురు ఈ ట్రాక్ గురించి మాట్లాడుతూ, ''కుచ్ ఖట్టా హెూ జాయ్'లో భాగం కావడం ప్రత్యేకమైనది. బాట్లీ ఖోలో మేము సెట్స్‌లో అద్భుతమైన క్షణాలను షేర్ చేసుకున్నాం. మీట్ బ్రదర్స్‌తో కలిసి పని చేస్తున్నాము. ఈ పాట అలాంటి ప్రతిభావంతులైన నటీనటులతో కలిసి ఈ ప్రయాణం నాకు చాలా ప్రత్యేకమైనది'' అని అన్నారు. కొంతకాలం క్రితం గురు రంధవా - సాయి మంజ్రేకర్ ఆగ్రాలో సినిమా షూటింగ్‌ను ముగించారు. 'కుచ్ ఖట్టా హెూ జాయ్' ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం. ఇందులో గురు రంధవా, సాయి ఎమ్ మంజ్రేకర్, అనుపమ్ ఖేర్, ఇలా అరుణ్, అతుల్ శ్రీవాస్తవ, పరితోష్ త్రిపాఠి, పరేష్ గంత్రా నటించారు. అమిత్ భాటియా అండ్ మాచ్ ఫిల్మ్స్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రానికి జి. అశోక్ దర్శకత్వం వహించారు. కుచ్ ఖట్టా హెూ జాయ్ చిత్రం పంజాబీ గాయకుడు గురు రంధవాకు నటుడిగా తొలి సినిమా. ఈ చిత్రం అధికారిక విడుదల తేదీ ప్రకటించాల్సి ఉంది.

మతిపోగొట్టేసిన మాళవిక అందం

దళపతి విజయ్ సరసన 'మాస్టర్' మూవీ తో హీరోయిన్ గా లైమ్ లైట్లోకి వచ్చిన మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ ప్రస్తుతం కోలీవుడ్ టాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోంది. ప్రెజెంట్ హీరోయిన్ గా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తోంది. ఓవైపు సినిమాలతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటూ మెల్లమెల్లగా పాపులారిటీ పెంచుకుంటుంది. సోషల్ మీడియాలో నిత్యం తన గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈమధ్య అందాల ఆరబోతలో అదిరిపోయే అవుట్ ఫిట్స్ ధరిస్తూ నెట్టింట దుమారం రేపుతోంది. మత్తెక్కించే కళ్ళతో కుర్రాళ్లను తన వైపుకు తిప్పుకునేలా గ్లామర్ ని ఒలకబోస్తున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా తన సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ఈ ఫోటోలో మరోసారి అదిరిపోయే అవుట్ ఫిట్ తో దర్శనమిచ్చింది. రెడ్ కలర్ అవుట్ ఫిట్ లో కళ్ళతోనే మాయ చేసేలా ఎక్స్ప్రెషన్స్ ఇస్తూ మాళవిక దిగిన లేటెస్ట్ పిక్స్ ఫ్యాన్స్ ని తెగ ఆకట్టుకుంటున్నాయి. స్టయిలిష్ సిట్టింగ్స్ ఫోజులతో

నెటిజన్స్ చూపు తిప్పుకోకుండా చేసింది. దీంతో మాళవిక ఫ్యాన్స్ ఈ అమ్మడి లేటెస్ట్ పిక్స్ ని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. అంతేకాకుండా రెడ్ కలర్ అవుట్ ఫిట్ లో మాళవిక మరింత హాట్ గా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. కాగా కొన్నాళ్లుగా ఈ మలయాళ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో తన అందంతో కుర్రకారును ఆకర్షిస్తూ వస్తోంది. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్ వేర్ లో మెరుస్తూ తెగ సందడి చేస్తోంది. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఆమెను మరింత ఎంకరేజ్ చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే మాళవిక లేటెస్ట్ స్టన్నింగ్ లుక్స్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఇక ప్రస్తుతం మాళవిక తమిళంలో చియాన్ విక్రమ్ సరసన 'తంగలాన్' సినిమాలో నటిస్తోంది. రీసెంట్ గా ఈ మూవీ నుంచి రిలీజ్ అయిన ట్రైలర్ ఆడియన్స్ నుంచి భారీ రెస్పాన్స్ ని అందుకుంది. 2024 జనవరి 26న ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాతో పాటు త్వరలోనే ప్రభాస్ కి జోడిగా మారుతి మూవీతో టాలీవుడ్ కి ఎంట్రీ ఇస్తోంది ఈ మలయాళ ముద్దుగుమ్మ. రీసెంట్ గానే ప్రభాస్ - మారుతి మూవీ షూటింగ్లో పాల్గొంది. అందుకు సంబంధించి కొన్ని ఫోటోలు కూడా నెట్టింట వైరల్ అయిన విషయం తెలిసిందే.

హనీరోజ్ తో మసాలా సన్నివేశాలా?

'వీరసింహారెడ్డి'తో హనీ రోజ్ తెలుగింట ఎంత పాపులర్ అయిందో తెలిసిందే. అంతకు ముందు రెండు..మూడు తెలుగు సినిమాలు చేసినా ఏ సినిమా తీసుకురాని గుర్తింపు బాలయ్య సినిమా తెచ్చి పెట్టింది. ఇదే సమయంలో అమ్మడు హాట్ హాట్ ఇన్ స్టా ఫోజులు నెట్టింట సంచలనం అవ్వడంతో మరింత పాపులర్ అయింది. వివిధ భంగిమల్లో హనీ పోజులే లక్షల్లో ఫాలోవర్స్ ని తెచ్చిపెట్టాయి. దీంతో అమ్మడు అప్పటి నుంచి ఆ రకమైన వేడి ఏమాత్రం తగ్గించకుండా అంతకంతకు రెట్టింపు చేసుకుంటూ వెళ్తుంది. ఆరకమైన పాపులారిటీ ఏకంగా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలకే ప్రమోట్ చేసింది. ప్రస్తుతం హనీ రోజ్ ప్రధాన పాత్రలో రాహేలు అనే సినిమా

తెరకెక్కుతోంది. ఆనందిని బాలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే హనీ రోజ్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈసందర్భంగా సినిమా గురించి కొన్ని ఆసక్తికర సంగతలు లీకవుతున్నాయి. ఇందులో యువతని మెప్పించే అంశాలు పుష్కలంగా ఉన్నాయని టాక్ వినిపిస్తుంది. స్క్రిప్ట్ దశలోనే ఆ రకమైన జాగ్రత్తలు తీసుకున్నారుట. హనీరోజ్ తో కొన్ని ఘాటైన మసాలా సన్నివేశాలు చేయించినట్లు...అవి సినిమాకి ప్రత్యేక ఆకర్షణ?...కుర్రకారులో ఊపు తెచ్చేలా ఉంటాయని గుస గుస వినిపిస్తోంది. హనీరోజ్ పాత్ర ప్రేక్షకులు ఏమాత్రం ఊహించని విధంగా ఉంటుందని..చాలా సన్నివేశాలు సర్ ప్రైజింగ్ గా అనిపిస్తాయని చిత్ర వర్గాలు అంటున్నాయి. మరి అమ్మడితో ఎంతటి సామసాలు చేయించారో? రిలీజ్ తర్వాత తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో హీరోయిన్లే ఐటం భామలైపోతున్నారు. అవసరం మేర హాట్ హాట్ సన్నివేశాల్లో..పాటల్లో వాళ్లే కనిపిస్తు న్నారు. దీంతో ప్రత్యేకంగా ఐటం భామల్ని దిగుమతి చేయాల్సిన అవసరం తగ్గింది. కానీ ఐటం భామల్లో ఉన్న ప్రత్యేకత హీరోయిన్ల కొరవడుతుంది అన్నది వాస్తవం. ప్రత్యేక ఐటం భామల్లో ఉండే గ్రేస్ స్వాగ్...హీరోయిన్లలో కనిపించలేదు.

పార్టీలోకి వస్తేనే ఇల్లు ఇస్తామని.. బెదిరించే ప్రభుత్వం మాది కాదు

హైదరాబాద్: మా పార్టీలోకి వస్తేనే ఇల్లు ఇస్తామని బెదిరించే ప్రభుత్వం తమది కాదని ఉప ముఖమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేసి తీరుతామని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలెవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని.. ఇది ప్రజా ప్రభుత్వమని చెప్పారు. "పదేళ్లలో రాష్ట్ర ప్రజలు నీళ్లు, నిధులు, నియామకాలు పొందలేదు. తొమ్మిదేళ్లలో ఒక రేషన్ కార్డు ఇవ్వలేదు. ప్రజల చేత ప్రజల కోసం వచ్చిన ప్రభుత్వం మాది. ప్రజాపాలన అందిస్తామని చెప్పి ఒప్పించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. మాది దొరల ప్రభుత్వం కాదు. ఒక వర్గం, ఒక వ్యక్తికి సంబంధించింది కాదు. మేం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజల సమక్షంలో అమలు చేస్తున్నాం. మీ దగ్గరకే వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ పెట్టి దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. ఈ రాష్ట్రాన్ని, సంపదను ప్రజలకు అంకితం చేస్తాం" అని భట్టి వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ గౌతమ్, రాష్ట్ర ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, హనుమంతరావు, శ్రుతి ఓజా, రాచకొండ సీపీ సుధీర్ బాబు పాల్గొన్నారు.

'అభయహస్తం'లో పైరవీలకు అవకాశం లేదు: పొన్నం – నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు 'అభయహస్తం' గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు సందేహాలుంటే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. "ప్రజల వద్దకే పాలన పేరుతో హైదరాబాద్‌లో 600 కేంద్రాల్లో కార్యక్రమం జరుగుతోంది. అర్హతను బట్టి లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. ఎలాంటి పైరవీలకు అవకాశం లేదు" అని పొన్నం స్పష్టం చేశారు.

ఉపాధి, ఆర్థికాభివృద్ధి ప్రాంతంగా మూసీ పరీవాహకం

హైదరాబాద్ మహానగరంలో మూసీనది ప్రారంభమయ్యే ప్రాంతం నుంచి చివరి వరకు మూసీ నది పరివాహక ప్రాంతాన్ని మొత్తం ఉపాధి, ఆర్థికాభివృద్ధి ప్రాంతంగా రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రిడ్జిలు, కమర్షియల్, షాపింగ్ కాంప్లెక్సులు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, హాకర్ జోన్లు, పాత్ వేలను ప్రభుత్వ, ప్రైవేటు పార్ట్నర్ షిప్ విధానంలో నిర్మించే విధంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మూసీనదిలో కాలుష్యాన్ని తగ్గించి, మురుగు నీరు ప్రవహించకుండా అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మూసీలో శుద్ధి చేసిన నీరు ప్రవహించేందుకు చర్యలు చేపట్టడంతోపాటు తగు నీటి మట్టం ఉండేలా చెక్ డ్యాంలు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తుంది

సంగారెడ్డి: ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమైంది. అభయహస్తం గ్యారంటీల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరుగుతోంది. సంగారెడ్డి జిల్లాలో కార్యక్రమాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు. మెదక్ జిల్లాలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తుందన్నారు. ప్రభుత్వం మీ ముందు వచ్చిందని... మీ దరఖాస్తులు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వాలు అంటే ప్రజలు నిర్ణయించి అధికారం ఇస్తారన్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ పోటీతత్వం అలవర్చుకోవాలి: హరీశ్ రావు

సిద్దిపేట: చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. విద్యతోపాటు క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని సూచించారు. చదవుతోపాటు ఆటల్లో ప్రతిభ చూపించినవారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. సిద్దిపేట ఫుట్‌బాల్ స్టేడియంలో ఇంటర్‌స్కూల్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని జాతీయ స్థాయి ఆటలకు సిద్దిపేట వేదికగా నిలిచిందన్నారు. ఆటలు అదుర్స్ అనేలా అన్ని వేదికలను పట్టణంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని ఆటలకు నెలవుగా సిద్దిపేట మారిందని చెప్పారు. పాఠశాలల స్థాయికే పరిమితమైన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు పంపేల సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 16 రకాల క్రీడలకు సంబంధించిన మైదానాలు, కోర్టులు, సౌకర్యాలను ఏర్పాటు చేశామని, దీంతో అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు అతిథ్యం ఇచ్చామన్నారు. స్విమ్మింగ్ ఫుల్ జాతీయ స్థాయిలో పోటీలకు, బ్యాడ్మింటన్, వాలీబాల్ రాష్ట్ర జాతీయ స్థాయి సెలెక్షన్స్, ఫుట్‌బాల్ సెలెక్షన్స్, రంగనాయక సాగర్ వద్ద జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్దిపేట వేదికయిందని చెప్పారు. సిద్దిపేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మరో రూ.11 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నామని, క్రికెట్ స్టేడియానికి రూ.4 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, హాకీ, కరాటే, రన్నింగ్, హ్యాండ్ బాల్, షాట్‌పుట్, స్కేటింగ్, అథ్లెటిక్స్ తోపాటు ఇటీవలే నూతన వాలీబాల్ అకాడమీ ఏర్పాటైందని చెప్పారు.

'నన్ను అలా పిలవొద్దు'.. మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు

ఆదిలాబాద్: జిల్లాలోని జైనథ్ మండలం జామినిలో ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నన్ను మేడం అని పిలవొద్దు. సీతక్క అని పిలవండి. మేడం... మేడం అంటే దూరం అయిపోతము. అదే గుర్తు పెట్టుకోండి. సీతక్క అంటేనే మీ అక్క, మీ చెల్లిలాగా కలిసి పోతాం. పదవులు శాశ్వతం కాదు.. విలువలు, మంచి పనులే శాశ్వతం. కాంగ్రెస్ పాలన అంటే గడీల పాలన కాదు, గల్లీ బిడ్డల పాలన. ప్రజలకు ఏ అవసరం ఉన్నా మాతో స్వేచ్ఛగా చెప్పుకోవచ్చు" అంటూ మంత్రి సీతక్క పేర్కొన్నారు.

ONE FAMILY. ONE VISION. ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL
బాణం గుర్తుకే మన ఓటు
BGK

కాంగ్రెస్‌ను ఓడించి టీబీజీకేఎస్ సాధించింది ఏంటి?

ఐఎన్‌టీయూసీని ఓడించారు సరే.. సింగరేణిలో బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ పరిస్థితి ఏంటి?

హైదరాబాద్ : సుదీర్ఘ వాయిదా అనంతరం ఎట్టకేలకు సింగరేణి ఎన్నికలు ముగిశాయి. ముందునుంచి ఊహించినట్టుగానే కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. మొత్తం 11 డివిజన్లలో ఐఎన్‌టీయూసీ 6, ఏఐటీయూసీ 5 డివిజన్లను గెలుచుకున్నాయి. 3 వేల పైచిలుకు మెజారిటీ సాధించిన ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ అవతరించాయి. బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ పలు డివిజన్లలో మద్దతు ఇవ్వడం ఏఐటీయూసీకి బాగా కలిసొచ్చింది. మెజారి సాధించడంలో దోహదపడింది. అయితే మొత్తం 13 సంఘాలు ఈ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ మినహా ఇతర సంఘాలు ఒక్కటంటే ఒక్క డివిజన్‌ను కూడా దక్కించుకోలేకపోయాయి. మిగతా సంఘాల మాట ఎలా ఉన్నా బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ కనుమరుగవ్వడం సింగరేణి వర్గాల్లో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ డివిజన్లలో, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోల్‌బెల్ట్ ప్రాంతం రామగుండం-1, రామగుండం-2 డివిజన్లలో ఏఐటీయూసీ విజయం సాధించింది. తద్వారా సింగరేణి కాలరీస్‌లో ఏడవ పర్యాయం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘనవిజయం సాధించింది. కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, రామగుండం-3, భూపాలపల్లి డివిజన్లలో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. ఈ డివిజన్లలో టీబీజీకేఎస్ కనీసం ఎక్కడా పోటీ కూడా ఇవ్వలేకపోయింది. ఎక్కడా ప్రభావం కూడా చూపలేకపోయింది.

వ్యూహం సరే.. ఏం సాధించినట్టు? : సింగరేణి ఎన్నికల్లో గెలిస్తే కాంగ్రెస్ మరింత బలపడుతుదని భావించిన బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో తమను ఓడించిన హస్తంపార్టీని మట్టి కరిపించడమే లక్ష్యంగా సింగరేణి ఎన్నికల చివరి క్షణంలో అడుగులు వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు కాదని పక్కకు నెట్టిన సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీకి మద్దతు తెలిపింది. కీలకమైన డివిజన్‌లలో మద్దతు ఇస్తున్నట్టు తీర్మానాలు కూడా చేశారు. దీంతో సింగరేణి ఎన్నికల్లో ఎర్రజెండా రెపరెపలాడడానికి సాయపడింది. ఇక్కడివరకు అంతా బాగానే అనిపిస్తున్నా బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ సింగరేణిలో కనుమరుగైందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 2012, 2017 గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపు ద్వారా సుదీర్ఘకాలం పాటు గుర్తింపు సంఘంగా కొనసాగిన టీబీజీకేఎస్ ప్రస్తుత ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క డివిజన్‌ను కూడా దక్కించుకోలేకపోవడం హాట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ ఓడించాలనుకున్న బీఆర్ఎస్ లక్ష్యం నెరవేరి ఉండొచ్చు. కానీ ఆ పార్టీకి కలిగిన ప్రయోజనం ఏంటో ఆ పార్టీకే తెలియాలి. నిజానికి టీబీజీకేఎస్ ప్రస్తుత ఎన్నికల్లో అనూహ్య రీతిలో కనుమరుగైంది. ఎన్నికల్లో పోటీకి నామినేషన్ వేసినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో క్యాడర్‌లో నైరాశ్యం కనిపించింది. టీబీజీకేఎస్ నేతలు పెద్దగా ఆసక్తిని ప్రదర్శించలేదు. అధిష్ఠానం కలగజేసుకున్నప్పటికీ పెద్దగా స్పందన కనిపించలేదు. దీంతో చాలా మంది కీలక నేతలు ఆ సంఘానికి గుడ్‌బై చెప్పి ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీల్లో చేరారు. కొన్ని ఏరియాల్లో టీబీజీకేఎస్ నేతలు ఏఐటీయూసీకి మద్దతు ఇవ్వాలని తీర్మానం చేశారు. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికల్లో గనుల వద్ద ఎక్కడా కూడా గులాబీ జెండా కనిపించలేదు. ఆ సంఘం ఎన్నికల చిహ్నమైన బాణం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించినవారు కూడా పెద్దగా కనిపించలేదు. దీంతో ప్రచారంలో కూడా గులాబీ జెండాల సందడి కనిపించలేదు. నిజానికి అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం పొత్తుతో పోటీ చేసిన కాంగ్రెస్, సీపీఐ అనుబంధ సంఘాలు సింగరేణి ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడ్డాయి. ఇక పొత్తుకు సరేమిరా అన్న బీఆర్ఎస్ పార్టీనే ఇప్పుడు సీపీఐ అనుబంధ ఏఐటీయూసీకి మద్దతు ప్రకటించడం ఆసక్తికర పరిణామమని సింగరేణి వర్గాలు చర్చించుకుంటున్నాయి. రానున్న రోజుల్లో సింగరేణిలో టీబీజీకేఎస్ భవితవ్యం ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.

31 రాత్రి తాగి నడిపితే ఊచలే..

రాయదుర్గం : నయాసాల్ వేడుకల్లో అతిగా మద్యం తాగి నడిపే వాహనదారులతోపాటు అందుకు కారణమైన పబ్బులు, బార్లు, క్లబ్బుల నిర్వాహకులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. యాజమాన్యాలు తమ ప్రాంగణంలో మద్యం తాగేందుకు ప్రోత్సహించినందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అతివేగం, రాంగ్ రూట్, సిగ్నల్ అతిక్రమణ, నిర్లక్ష్య డ్రైవింగ్, శిరస్త్రాణం ధరించకపోతే గుర్తించేందుకు ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ఉల్లంఘనలు గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ డీవీవీ శ్రీనివాస్ బుధవారం ప్రత్యేక మార్గదర్శకాలు, సూచనలు జారీ చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు : అన్ని రహదారుల్లో రాత్రి 8 గంటల నుంచి డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తారు. పట్టుబడితే మొదటిసారికి రూ.10 వేల జరిమానా లేదా 6 నెలల జైలు శిక్ష ఉంటుంది. ఎక్కువసార్లు దొరికితే రూ.15 వేలు లేదా రెండేళ్ల జైలు శిక్ష. డ్రైవింగ్ లైసెన్సు సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తారు. ధ్రువపత్రాల్లేకుంటే వాహనాలను స్వాధీనం చేసుకుంటారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, బాలలు వాహనాలు నడిపి పట్టుబడితే యజమాని సహా ఇద్దరిపైనా చర్యలుంటాయి. అధిక శబ్దాలతో పాటలున్నా.. నంబరు ప్లేట్ లేకున్నా సీజ్ చేస్తారు. కార్లల్లో కిక్కిరిసి, పైభాగంలో కూర్చుని ప్రయాణించకూడదు. ఔటర్‌రింగ్‌రోడ్డు, పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయానికి వెళ్లేవి మినహా ఇతర వాహనాలకు అనుమతి లేదు. రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు శిల్పాలేవుట్, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, షేక్‌పేట, మైండ్ స్పేస్, రోడ్ నం.45, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, సైబర్ టవర్స్, ఫోరం మాల్, జేఎన్‌టీయూ, ఖైత్లాపూర్, బాలానగర్ బాబుజగ్జీవన్‌రామ్‌పైవంతెనలు మూసేస్తారు. డ్రైవర్లు రైడ్ నిరాకరిస్తే జరిమానా. ట్యాక్సీ, క్యాబ్, ఆటో డ్రైవర్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తూ అనుచితంగా ప్రవర్తించకూడదు. క్యాబ్ డ్రైవరు ఎట్టి పరిస్థితుల్లో రైడ్ నిరాకరించొద్దు. దీన్ని మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద రూ.500 జరిమానా విధిస్తాం. రైడ్ రద్దు చేసినట్లు గుర్తిస్తే వాహనం నంబరు, సమయం, ప్రదేశం తదితర వివరాలతో 94906 17346కు ఫిర్యాదు చేయాలి.

ప్రజాపాలన ఏర్పాట్లపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం

హైదరాబాద్, డిసెంబర్ 28: ప్రజాపాలన ఏర్పాట్లపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో అభయ హస్తం - ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గోషామహల్, మంగళహాట్ డివిజన్‌లను ఎమ్మెల్యే రాజాసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ఏర్పాట్లపై ఆయన అభ్యంతరం తెలిపారు. వార్డు కార్యాలయాల్లో ప్రజలకు దరఖాస్తులు ఫామ్స్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు దరఖాస్తులు ఇవ్వకుండా బయట జిరాక్స్ షాప్‌లో తెచ్చుకోవాలని, ఒక్కో దరఖాస్తుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు.

అభయహస్తం దరఖాస్తుల ఫామ్లతో కొత్త దందాకు తెర.. ఇదేంటని ప్రశ్నిస్తున్న పేదలు

హైదరాబాద్ : తెలంగాణవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమాలు మొదలయ్యాయి. గురువారం అభయహస్తం దరఖాస్తులను అధికారులు ప్రారంభించారు. ఐదు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తు ఫారాలను ప్రజలకు అధికారులు అందజేస్తున్నారు. అయితే ప్రజాపాలన.. అభయ హస్తం అప్లికేషన్ ఫామ్ల విషయంలో సరికొత్త దందాకు కొందరు దళారులు తెరతీశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒక్కో ఫారంను రూ.50 నుంచి రూ.100 రూపాలకు అమ్ముతున్నారు. ప్రతీ కౌంటర్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో పేద ప్రజలు తప్పదని దరఖాస్తు ఫామ్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న అప్లికేషన్ ఫామ్లను కూడా కొందరు దళారులు, జిరాక్స్ సెంటర్ల దళారులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెద్ద ఎత్తున అమ్మకాలు చేపట్టంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేదల కోసం ప్రభుత్వం తీసుకువస్తున్న పథకాలకు సంబంధించి ఫామ్ల విషయంలో దళారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని పేద ప్రజలు కోరుతున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అభయహస్తం దరఖాస్తులను అధికారులు ప్రజలకు అందిజేస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. పర్యవేక్షణ కోసం మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉండనుంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com